ENTERED
KSR02B1145C
E
ENTERED

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 13, 2016



భళారే
బాలల చిత్రం







కుటుంబ కథా చిత్రం

కమల్, శృతి

ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు సినీరంగంలో నటులు, మ్యూజిక్ కంపోజర్స్, గాయకులుగా వారసత్వాన్ని తీసుకోవడం ఒకప్పటి ట్రెండ్. ప్రస్తుతం సినిమాల్లోని వివిధ విభాగాల్లో బాధ్యతలు స్వీకరిస్తున్నాయి కొన్ని కుటుంబాలు. ఈ సినిమా కుటుంబాల ఫార్ములా వారి సక్సెస్ రేట్‌ని పెంచుతోంది. ఒక వ్యక్తి బలహీనతలు, సామర్థ్యాలు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులకు తెలిసినంతగా ఇతరులకు తెలీవు. మహేష్ బాబు చిత్రాలకు ఎక్కువగా భార్య నమ్రతే కాస్ట్యూమ్ డిజైనర్. దీనికో లాజిక్ ఉంది. సినిమా సెట్స్‌లో ఒకరి ఆలోచనలతో మరొకరు ఏకీభవించని సందర్భాల్లో కలిసి పనిచేయడం చాలా కష్టమౌతుంది. కుటుంబసభ్యులైతే తేలికగా అర్థం చేసుకోగలుగుతారనేది నమ్రత ఫిలాసఫీ. చిరు కుటుంబం నుంచి ఎక్కువ మంది హీరో ఇమేజ్‌ని దక్కించుకుంటే జై చిరంజీవ, శంకర్‌దాదా జిందాబాద్ చిత్రాలతో కాస్ట్యూమ్ డిజైనర్‌గా మంచి మార్కులు కొట్టేశారు పెద్ద కూతురు 'సుస్మిత'. చిరు 150వ చిత్రం 'ఖైదీనెంబర్ 150'లోనూ సుస్మితే కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. పవన్ కళ్యాన్‌కు రేణుదేశాయ్ కూడా ఒకప్పుడు కాస్ట్యూమ్ డిజైనర్. డిసెంబర్ నెలలో విడుదల కానున్న కమల్ కొత్త చిత్రం 'శభాష్ నాయుడు' చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరిస్తోంది నటి గౌతమి. కమల్ కూతురు శృతి కూడా తండ్రి దుస్తులు, స్టైల్ విషయంలో కీలక బాధ్యత నిర్వహిస్తోంది. సినిమా ఒక క్రియేటివ్ రంగం. ఇక్కడ క్రియేటివిటీతోనే ముందడుగేయాల్సి ఉంటుంది. పాత్ర ప్రాధాన్యతను బట్టీ నటులు, కాస్ట్యూమ్స్‌పై ప్రత్యేకంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి కీలక సందర్భాల్లో రమ రాజమౌళి సహకారం తోడవడమే తన సినిమా సక్సెస్‌కి కారణమంటారు రాజమౌళి. సింహాద్రి చిత్రానికి కాస్ట్యూమ్స్ విషయంలో డిజైనర్స్‌తో పొంతన కుదరక కొన్ని ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు రాజమౌళి. భార్య రమా సూచనలు ఫాలో అవడం, ఆ చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో రమా, రాజమౌళి చిత్రాలకి కాస్ట్యూమ్ డిజైనర్‌గా మారారు. దర్శకుడు శ్రీను వైట్లకి పెద్ద హిట్‌నిచ్చిన చిత్రం దూకుడు. ఈ చిత్రానికి కాస్ట్యూమ్స్‌ని డిజైన్ చేసింది తన భార్య రూప.

రమా, రాజమౌళి

మహేశ్, నమ్రత



చిరంజీవి, సుస్మిత

KSRO2BIU5
ENTERED

అతడు కాంతిని వంచాడు



ప్రపంచ చరిత్రలో ఆవిష్కరణలు కొత్త మార్పుకు దారితీశాయి. ఆధునికతను సంతరించుకున్న సాంకేతిక పరిజ్ఞానం ప్రజల జీవన శైలిలో ఎన్నో మార్పులకు కారణమైంది. కొంగొత్త విషయాలు, ఆవిష్కరణలను ప్రతి దశలో మానవుడు తన అవసరాలకు అనుగుణంగా మలుచుకోవడం అవలంబించాడు. కమ్యూనికేషన్ ప్రపంచంలో వినూత్నమైన మార్పులను తెచ్చింది ఫైబర్ ఆప్టిక్స్. ఇది అందుబాటులోకి రావడానికి నరీందర్‌సింగ్ కపాని కృషి మరువలేనిది. అందుకే కపానీని 'ఫాదర్ ఆఫ్ ఫైబర్ ఆప్టిక్స్' అంటారు.

ఫైబర్ ఆప్టిక్స్ ఒక అతి పల్చని గాజువైరు. తల వెంట్రుక కన్నా పలుచని పరిమాణంలో ఉన్నా ఇది దూర ప్రాంతాలకు సమాచార సంకేతాలను అందిస్తుంది. కాంతిని ఒక చివరి నుంచి మరో చివరికి ప్రసారం చేస్తుంది. సమాచారాన్ని అత్యంత వేగంగా బదిలీ చేసే ఈ సాంకేతిక ప్రక్రియను భారత సంతతికి చెందిన అమెరికన్ శాస్త్రవేత్త డా॥నరీందర్ సింగ్ కపానీ కనుగొన్నారు. సుదూర ప్రాంతాలకి సైతం సమాచారాన్ని ఇట్టే చేరవేయగల ఫైబర్ ఆప్టిక్స్ ద్వారా ఎండోస్కోపి, లేజర్ సర్జరీ వంటి వైద్య చికిత్సలను సత్వరమే పొందగలుగుతున్నాం. కపాని పంజాబ్ రాష్ట్రంలోని మొగలో 1926 అక్టోబర్ 31న జన్మించారు. చిన్న తనం నుంచే అద్భుతమైన తెలివితేటలు కలిగిన కపానికి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడే మార్గదర్శి. కాంతి ఎప్పుడూ సరళ రేఖలోనే పయనిస్తుందని ఆ ఉపాధ్యాయుడు చెప్పిన పాఠం ద్వారా తెలుసుకున్నాడు. కాంతి అలానే ఎందుకు పయనిస్తుంది? అటు, ఇటు వంపులు ఎందుకు తిరగదు? అనే కొత్త ఆలోచనలు మొదలయ్యాయి. కపానిలో ఎంతో ఉత్సుకతను రేకెత్తించిన ఆ ప్రశ్న నుంచి పుట్టిందే ఫైబర్ ఆప్టిక్స్ ఆవిష్కరణ. దీనిపై అతను ఎన్నో ప్రయోగాలు చేసి కాంతి వంగి కూడా ప్రసరిస్తుందని కనుగొన్నాడు. తద్వారా తనకు తన ఉపాధ్యాయుడు చెప్పింది తప్పు అని నిరూపించాడు. ఆగ్రా యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసిన తరువాత ఆప్టిక్స్‌పై ఉన్నత చదువుల కోసం లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలో చేరాడు కపాని. 1955లో పిహెచ్‌డి పట్టా పొందిన తరువాత రోచెస్టర్ విశ్వవిద్యాలయంలోను, ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఫైబర్ ఆప్టిక్స్‌పై పరిశోధనను కొనసాగించాడు.

ఫైబర్ ఆప్టిక్స్ కమ్యూనికేషన్, బయోమెడికల్ సెన్సార్ ఇన్‌స్ట్రుమెంట్స్, లేజర్ టెక్నాలజీ, సోలార్ ఎనర్జీ, కాలుష్య నియంత్రణపై తన పరిశోధనని కొనసాగించాడు. ఫైబర్ ఆప్టిక్స్‌పై కపాని పరిశోధన చేసే సమయంలో భౌతిక శాస్త్రవేత్త హరాల్డ్ హాప్‌కిన్స్‌తో కలిసి పనిచేసేవాడు. ఒక ప్రముఖ సైన్స్ పత్రిక తమ జనవరి సంచికలో కపాని పరిశోధనా పత్రాలను ప్రచురించింది. తర్వాత ప్రపంచంలోని పలు పత్రికలు కొన్ని వందల పరిశోధనా పత్రాలను ప్రచురించాయి. ప్రతి పరిశోధన పత్రంలో ఫైబర్ ఆప్టిక్స్‌ను ప్రస్తావించేవాడు కపాని. సైన్స్, బిజినెస్, మేనేజ్‌మెంట్ రంగాలతో పాటు విద్యావేత్తగా, ఉపన్యాసకుడిగా, పబ్లిషర్‌గా, రైతుగా విభిన్న కోణాలను ఆయన తన జీవితంలో స్పృశించాడు. అనేక రకాల పెయింటింగ్స్‌ను కూడా సేకరించేవాడు. 1960లో 'ఆప్టిక్స్ టెక్నాలజీ ఇంక్' అనే సంస్థను ఏర్పాటు చేశాడు. అమెరికాతోపాటు కొన్ని ఇతర దేశాలలో కూడా కంపెనీ శాఖలను స్థాపించాడు. 1973లో కాప్ట్రాన్ అనే కంపెనీని స్థాపించి సి.ఇ.వో, ప్రెసిడెంట్ బాధ్యతలను నిర్వర్తించారు. 1990లో కాప్ట్రాన్ ఎ.ఎమ్.పిలో విలీనమైంది. ఆ సంస్థలోనూ 9 సంవత్సరాలు పనిచేశాడు కపాని. తరువాత కె2 ఆప్ట్రానిక్స్ పేరుతో మరో కంపెనీని స్థాపించాడు. కపానీ స్థాపించిన కంపెనీలన్నీ ఫైబర్ ఆప్టిక్స్‌లో ఆవిష్కరణలకి దోహదపడ్డాయి. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో రిజెంట్ ప్రొఫెసర్‌గా పనిచేయడంతోపాటు బెర్క్లీ శాంతాక్రజ్‌లోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలోనూ ప్రొఫెసర్ గా పనిచేశాడు కపాని. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్‌కు డైరెక్టర్‌గా, స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో కీలక బాధ్యతల్ని స్వీకరించారు. డా॥కపాని సిఖ్ ఫౌండేషన్ అనే సంస్థను ఏర్పాటు చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన నివసిస్తున్నా శాన్‌ఫ్రాన్సిస్‌కోలోని ఆసియాన్ ఆర్ట్స్ మ్యూజియమ్‌కు 50 లక్షల డాలర్లను విరాళాన్ని అందించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచార రంగంలో కొత్త ఒరవడిని సృష్టించిన కపానీని భారత ప్రభుత్వం ప్రవాసి భారతీయ సమ్మాన్‌తో సత్కరించింది. 1998లో అమెరికాకు చెందిన పాన్‌ఆసియన్ 'ది ఎక్సలెన్స్ 2000 అవార్డు'ని అందుకున్నారు కపాని. ఇవికాక అనేక సంస్థలు అతనిని సత్కరించాయి. ఫార్చున్ మ్యాగజైన్ 1999లో ప్రచురించిన ప్రత్యేక సంచికలో ప్రముఖ స్థానాన్ని కల్పించింది. 2009లో కపానికి నోబుల్ బహుమతి వస్తుందని అందరూ భావించారు కానీ ఆ బహుమతి మరో శాస్త్రవేత్తకు అందింది.

- కె.ఎస్.ఎం



స్ఫూర్తి..................3
ఇది జర్నా సాహసం
స్టార్........4
'నకిలీ' కాదు
నవ్వుల్ పువ్వుల్......... 5
వింత లోకం...........10
పన్ను ఉంగరం
విజేత.............. 11
దమ్మున్న రేసర్
కవిత్వమ్.............14
అ(భ్ర)మరావతి

ఇండెక్స్

భళారే బాలల చిత్రం

అట్టమీది కథ...6

నాకళ్ళతో - 12
ఈ నగరం
బంగారమట

తెలుసా..................15
ఫోన్ కన్నా ముఖ్యం
కథ 16
ఫ్లెక్సీలు
రుచి....................21
గోబీ 65
బాల నేస్తాలు............23
12 ఏళ్ల కంపోజర్
పద వికాసం.....
....24



దిబ్బుదిబ్బు దీపావళి

స్నేహ ఆదివారం సంచికలో అట్టమీది కథగా దిబ్బుదిబ్బు దీపావళి సందర్భానుసారంగా అందించారు. ఎన్ని కష్టాలు ఎదురవుతున్నా... సాధక బాధకాలెదురౌతున్నా సృజనాత్మకతను వీడని రాజన్ జీవితం ధన్యం. లింగ సమానత్వాన్ని పెంపొందించే యత్నంలో చిత్ర మాధ్యమం ద్వారా కృషి చేస్తున్న వైష్ణవి సుందర్ అభినందనీయురాలు. ముంబయ్ స్లమ్‌ల్లో రాక్ స్టార్లు సంగీతం ప్రవృత్తిగా.... చెత్త రీసైక్లింగ్ వృత్తిగా కొనసాగిస్తున్న వారి జీవన యానికి హ్యాట్స్ ఆఫ్. ఖర్జూరదేశం(అబుధాబి) విశేషాలు చిత్ర సహితంగా అలరించాయి. 'రణభేరి' కవిత్వం అభ్యుదయ భావపరంపరలను మాముందుంచింది. జామీను పావురం కథకర్తకు అభినందనలు. వెండార్స్100 చిత్రాల ఫోటోబుక్ రూపొందించాలన్న లోయ్స్ కల నెరవేరాలని ఆశిస్తున్నాము.

- నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం

యదార్థ చిత్రాలు

మహిళా సాధికారతను ప్రబోధించే యదార్థ చిత్రాలను నిర్మిస్తున్న చెన్నయ్‌లో ఓ మారు మూల గ్రామంలో పుట్టిన వైష్ణవి సుందర్ తపనకు మెచ్చి ఓ పాకిస్తాన్ సంస్థ సహకారం అందించడం గొప్పవిషయం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని ఫొటోగ్రఫీ వైపు దృష్టి మళ్లించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్న రాజన్ అభినందనీయుడు. అబుదాబి దేశం గురించి పరిచయం ఆసక్తిని కలిగించింది. వేల సంవత్సరాల క్రితం అక్కడ అంతరించిపోయిన ఏనుగు జాతి జంతువు అస్థి పంజరం 'ఊలి' నిర్ఘాంతపరిచింది. జెనిటిక్ అడ్వాంటేజ్ అని ముద్ర పడిన స్టార్ అథ్లెట్ శాంతి సౌందరరాజన్ స్పోర్ట్స్ కెరీర్‌ని దెబ్బతీయడం కలచివేసింది.

- టి.సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం

మట్టిలో మాణిక్యాలు

ముంబైలోని ధారావి మురికి వాడల్లో చిన్నారుల రాక్ బ్యాండ్ కథనం ఆసక్తికరంగా ఉంది. మట్టిలో మాణిక్యాల్లా చెత్త ఏరుకునే చిన్నారుల్లో ప్రతిభ అభినందనీయం. ఖర్జూరదేశం అబుదాబి గురించి మాకు తెలియని చాలా విషయాలు చెప్పారు. బెంగాల్ టు బాలీవుడ్‌కు హీరయిన్ల పయనం బాగుంది. తమిళనాడు అథ్లెట్ శాంతి సౌందరరాజన్ కథనం స్ఫూర్తిదాయకంగా ఉంది. చిన్నచిన్న విమర్శలకే కుంగిపోయే ఈ కాలంలో పడిలేచిన కెరటంలా ఆమె ప్రయత్నం అందరికీ ఆదర్శనీయం.

- వద్ది దుర్గారావు, ఎల్ ఎన్‌డీ పేట

అలరించిన అబుదాబి

ఈ వారం స్నేహ సంచికలో వచ్చిన దిబ్బు దిబ్బు దీపావళి ఆకట్టుకుంది. అబుదాబి విశేషాలను వ్యాసకర్త కళ్లకు కట్టినట్టు వర్ణించారు. పర్యాటక కేంద్రంగా అబుదాబి గురించి అనేక విషయాలను తెలియజేసినందుకు ధన్యవాదాలు. అంతా సినిమాటిక్‌గా, అపురూప చిత్రం, రెండో పరుగు, జామీను పావురం కథ, కళ్లు జాగ్రత్త, అనుభవాలే చిత్రాలు చదివించాయి.

- బాలాజీ, చిలకలూరిపేట

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

అది గుజరాత్‌లోని ఓ సెరామిక్ ఫ్యాక్టరీ. బాలలే కార్మికులు. వెట్టిచాకిరీయే జీవితం. అక్కడో కోవర్ట్ ఆపరేషన్ జరిగింది. చేసింది 22 ఏళ్ల బిబిఎ విద్యార్థిని జర్నాజోషి. వెంటనే ఏం జరిగి ఉంటుంది? ఆమెపై భౌతిక దాడి. ధనం, రాజకీయంతో కండ కావరమెక్కిన యాజమాన్యం మరి. ఓ ఆడపిల్ల ప్రయత్నం వృథాయేనా. కాదు కొన్నాళ్లకు ఆ ఆపరేషన్ ఫలితాన్నిచ్చింది. 111 మంది బాలలు విముక్తి అయ్యారు. అహమ్మదాబాద్‌లోని మార్బీ సెరామిక్ కంపెనీ కబంధ హస్తాల నుంచి బాల్యాన్ని రక్షించిన ఆ యువతి సాహసంతోనే అసలామె ఆ పని చేసేందుకు కారణం, ఆపరేషన్‌ను ఎలా నిర్వర్తించిందో తెలుసుకుంటే మరింత ఆశ్చర్యపోతారు. వీలుంటే మరొకరు స్ఫూర్తి పొందుతారు.

స్ఫూర్తి

ఇది జర్నా సాహసం

జర్నాజోషి ఒకసారి మోర్బీ ప్రాంతంలోనున్న తనబంధువులింటికి వెళ్లింది. అక్కడ ఉదయాన్నే కొంత మంది బస్సులో చాలామంది పిల్లల్ని తీసుకెళ్లడాన్ని గమనించింది. రెండో రోజు కూడా అదే సమయానికి మరలా బస్సులో పిల్లలను తీసుకు వెళ్లారు. అది స్కూలు బస్సుకానందున ఆమెలో అనుమానం రేకెత్తింది. వీరిని ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలుసుకోవాలనే తపన బలపడింది. దీని కోసం జర్నా వారం రోజులపాటు బంధువులింట్లోనే గడిపింది. ఒకరోజు బస్సును అనుసరించింది. ఆ బస్సు నేరుగా మోర్బీలోని అతిపెద్ద సెరామిక్ కంపెనీ (సోనాకీ) ముందు ఆగింది. పిల్లలందరినీ లోపలికి తీసుకెళ్ల డాన్ని చూసింది. వెంటనే అమెలో అనేక అనుమా నాల్ని తలెత్తాయి. అసలు ఈ పిల్లల్ని ఫ్యాక్టరీలోకి ఎందుకు తీసుకెళ్తున్నారు? చదువుకోవాల్సిన వయస్సులో ఫ్యాక్టరీలో ఏమి పని? లోపల ఏమి జరుగుతుందో తెలుసుకోవాలనుకుంది. వెంటనే ఆమె మనసులో ఒక ఆలోచన తట్టింది.

ఉద్యోగంలో చేరిన జర్నా

జర్నాజోషి బ్యాచిలర్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ (బిబిఎ) విద్యార్థి. ఆ ఫ్యాక్టరీలో ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే ఎలా ఉంటుందనుకుంది. క్షణం ఆలస్యం చేయ కుండా ఆఫీసులో ఉద్యోగానికి దరఖాస్తు చేసింది. యాజమాన్యం ఆమె అడిగిన ఉద్యోగం ఖాళీ లేదంది. అంతటితో జర్నా ఆగలేదు. ఇంకేమైనా ఉంటే ఇవ్వరా అని ప్రాధేయపడింది. ఇక్కడ పింగాణీ కప్పులు, సాసర్లపై డిజైన్ అంటించే ఉద్యోగాలున్నా యని, ఇష్టమైతే అందులో చేరమంది. జర్నా వెనుకా ముందు ఆలోచించకుండా వెంటనే చేరింది. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే లోపల జరిగే విషయాలను 15 రోజుల లోపే కనిపెట్టింది.

లోపల ఏమి జరుగుతుందంటే..

ఫ్యాక్టరీలో పిల్లల చేత బలవంతంగా వెట్టి చాకిరీ పని చేయిస్తున్నారు. వారికి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు బయ టకు వచ్చే అనుమతి లేదు. చట్ట ప్రకారం బాల కార్మికుల చేత పని చేయించకూడదు. కానీ ఫ్యాక్టరీ యజమానులు ఏకధాటిగా పది గంటలు పని చేయి స్తున్నారు. వారు చేసే పనులు చాలా కష్టంతో కూడు కున్న పనులు. పని చేసే ప్రదేశం చాలా వేడిగా ఉంటుంది. పిల్లలు తాగడానికి చల్లని నీళ్లు కావాలని ఎంత బతిమిలాడినా ఇచ్చే పరిస్థితి లేదు. అక్కడి వాతా వరణం అనారోగ్యకరంగా ఉంది. కంపెనీ యాజ మాన్యం పూర్తిగా మానవ హక్కులను ఉల్లంఘిస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. జర్నా ఎలాగైనా ఆ పిల్లలను వెట్టిచాకిరీ నుండి విముక్తి కలిగించాలని నిర్ణయించుకుంది. ఫ్యాక్టరీలో జరిగే అన్యాయాన్ని సంబంధిత అధికారులను కలిసి వివరించింది. కానీ ప్రయోజనం లేదు. జర్నా నిరుత్సాహపడలేదు. గుజరాత్ అప్పటి సిఎం ఆనందిబెన్ పటేల్‌కు లేఖ రాసింది. స్టేట్ ఆఫీసర్స్ అందరినీ కలిసి ఫ్యాక్టరీలోని అన్యాయాన్ని వివరించింది. జర్నా ఇచ్చిన సమాచారంతో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది.

సామాజిక రక్షణ అధికారులు, పోలీస్ అధికారులు, కార్మికశాఖ అధికారులు, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్‌లు అందరూ కలిసి ఫ్యాక్టరీపై దాడి చేశారు. ఫ్యాక్టరీలో పనిచేసే పిల్లల వయసు నిర్ధారణకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు. ఈ దాడిలో 111 మంది బాల కార్మికులు ఉన్నారని గుర్తించి వారందరినీ బానిస బతుకు నుంచి విముక్తి చేశారు. వీరిలో 100 మంది అమ్మాయిలే. ఇది సౌరాష్ట్రలోని అతి పెద్ద రెస్క్యూ ఆపరేషన్. ఇంత పెద్ద ఆపరేషన్‌కు సహకరించిన జర్నాకు ప్రభుత్వ ఆఫీసర్ల నుంచి అభినందన వెల్లువలు కురిశాయి. జర్నా చాలా ధైర్యం కల అమ్మా యని, అదే కంపెనీలో పనిచేస్తూ లోపల విషయాలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తేవడమనేది సాహసంతో కూడుకున్నదని, ఈ గొప్పతనమంతా ఆమెదేనని సామాజిక రక్షణ శాఖ ఆఫీసర్ కనకసింహ్ జ్వాలా కొనియాడారు. దాడి జరిగిన తీరుని బట్టి ఫ్యాక్టరీ యాజమాన్యానికి అనుమానం కలిగింది. దాడి వెను కున్న హస్తం జర్నా దని తెలుసుకున్న యాజమాన్యం ఆమె స్కూటీపై వెళు తుండగా దాడి చేయించారు. ఈ దాడిలో ఆమెకు కాళ్లు, చేతులు, ముఖంపై అనేక దెబ్బలు తగిలాయి. దాడులు ఎన్ని జరిగినా వెనకడుగు వేసేది లేదని, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుతానని, పోరాటం ఆగదని, ఇలాంటి మరిన్ని సెరామిక్ కంపెనీలలోని బాల కార్మికులకు విముక్తి కలిగిస్తానని శపథం చేస్తోంది జర్నా.

- కుమారి ఎన్

'నకిలీ' కాదు

గుండెను కదిలించే సంగీతం, మనసును హత్తుకునే కథాంశం, ఆకట్టుకునే నటన ఓ చిత్రం విజయానికి కీలకం. అవన్నీ కూడా ఒక్కడే నిర్వహిస్తే చాలా ఫెయిల్యూర్స్‌ను మనం చూశాం. కానీ తాను చేసిన ఆ తరహా ప్రతి చిత్రం కూడా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుంటే.. ఆ కళాకారుణ్ని ఏమనాలి. అసలలాంటి కథల్నే ఎంచుకుంటూ కెరీర్‌లో కదులుతుంటే ఆ ఎంపికను ఎలా చూడాలి. విజయ్ ఆంటోనీ చిత్రాలు విలక్షణం.. అతడి ప్రతిభా విలక్షణమే. అతడు కంపోజ్ చేసే సినిమా, సినీ ప్రయాణమూ ఓ ప్రయోగమే. కానీ అది బ్లాక్‌బస్టర్‌గా విజయవంతమవుతోంది. 'బిచ్చగాడు'గా అభిమాన ధనాన్ని బాగా పోగేసుకున్న విజయ్ ఆంటోనీ 'నకిలీ'గాను తెలుగు ప్రేక్షకులకు బాగా తెలుసు. అతడి చిత్రం పేరు 'నకిలీ'యేమో గానీ అతడి టాలెంట్ మాత్రం ఒరిజినలే.

- విజయ్ ఆంటోనీ 1975 జులై 24న తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా నాగర్‌కోల్‌లో జన్మించాడు.
- విజయ్ మెట్రిక్యులేషన్ వరకు చదువును తిరునల్వేలిలో పలయంకొట్టయ్‌లోని సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో పూర్తి చేశారు. డిగ్రీ విజువల్ కమ్యూనికేషన్‌లో లయోలా కాలేజ్ చెన్నైలో పూర్తి చేశారు.
- విజయ్ ఆంటోనీ భార్య పేరు ఫాతిమ. ఫాతిమాకు కూడా రంగుల ప్రపంచం పట్ల ఆసక్తి ఉంది. ఆమె ఒక పక్క ఇంటి బాధ్యతలు నిర్వహిస్తూనే కోలీవుడ్‌లో నిర్మాతగా రాణిస్తోంది.
- విజయ్ ఆంటోనీ నటించిన ఇండియా-పాకిస్తాన్, సలీం, నాన్ చిత్రాలకు నిర్మాతగా పనిచేసింది.
- విజయ్ కాలేజీ విద్య పూర్తి కాగానే మొదటగా సౌండ్ ఇంజినీర్‌గా పనిచేశారు. డాక్యుమెంటరీ రూపంలో బుల్లితెరకు సంగీతాన్ని అందించారు.
- అలా తొలిసారిగా యస్.ఎ.చంద్రశేఖర్ దర్శకత్వంలో 2005లో 'సుక్రాన్' చిత్రానికి సంగీతాన్ని అందించే అవకాశం వచ్చింది.
- 2009లో ఓ మీడియా జెయింట్ నిర్వహించిన ఫిలిం ఫెస్టివల్‌లో తను సంగీతం అందించిన 'నక్కా ముక్కా' పాట బెస్ట్ మ్యూజిక్ కేటగిరిలో విజేతగా నిలిచింది. ఈ పాట విజయ్‌కు ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది.
- 2011 ప్రపంచ వరల్డ్ క్రికెట్ కప్ సమయంలో 'నక్కా ముక్కా' పాటను వినిపించారు.
- 2012లో తొలిసారిగా థ్రిల్లర్ సినిమా 'నాన్'లో ప్రధాన పాత్ర పోషించి హీరోగా తెరంగేట్రం చేశారు. తర్వాత 'సలీం' హీరోగాను మ్యూజిక్ డైరెక్టర్‌గా మెప్పించారు.
- ఈ రెండు చిత్రాలు ఊహించని స్థాయిలో విజయాన్ని సాధించాయి.
- రొమాంటిక్ కామెడీ చిత్రం 'ఇండియా-పాకిస్తాన్'లో నటించారు. ఈ చిత్రంలో మ్యూజిక్ కంపోజ్ చేయకుండా కేవలం నటనకే పరిమితమయ్యారు.
- విజయ్ 'పిచ్చికర్రై' చిత్రానికి 'డిష్యుం' డైరెక్టర్ శశి సహకారంతో నటించారు. ఇది తెలుగులో 'బిచ్చగాడు'గా అనువాదమైంది. ఇది ఈ సీజన్‌లో వచ్చిన మంచి చిత్రంగా చెప్పొచ్చు. ఈ చిత్రానికి నిర్మాత, సంగీతకారుడు, నటుడిగా చేశారు. ఈ చిత్రం ప్రతి వ్యక్తి మనసును కదిలించే కథా చిత్రంగా నిలిచింది.
- విజయ్ కొత్త తెలుగు డైరెక్టర్ల స్క్రిప్ట్‌నే ఎక్కువగా ఇష్టపడతారట. హైదరాబాద్ అంటే బాగా ఇష్టమని తన సినిమా షూటింగ్‌లు యాభై శాతం హైదరాబాద్‌లోనే చేస్తానని ఓ సందర్భంలో చెప్పాడు. ఎక్కువగా నటులను తెలుగు, తమిళం తెలిసినవారినే ఎంచుకుంటారట.
- విజయ్ నటించిన సైతాన్, యమన్ చిత్రాలు తెలుగు, తమిళ భాషల్లో రాబోతున్నాయి.
- ప్రస్తుతం తెలుగులో 'బేతాళుడు' (సైతాన్) ఆడియో రిలీజ్ అయింది.
- విజయ్ ఆంటోనీ తమిళంలో సంగీతాన్నందించిన 'డిష్యుం' చిత్రం తెలుగులో 'డిష్యుం డిష్యుం', షాపింగ్ మాల్ (అంగడి తీరు), మహాత్మా (పుతైయా దళపతి) చిత్రాలకు పనిచేశారు. పులివేట (వెటైకరన్)లోని పాటకు విజయ్ అవార్డు వచ్చింది. యువన్ యువతి (డేర్), నాన్ (నకిలి), బుల్లెట్ రాజా (దరువు) చిత్రాలుగా విడుదలయ్యాయి.



✦

నవ్వుల్ - పువ్వుల్

ఖర్చు



డాక్టర్: నీకు ప్లాస్టిక్ సర్జరీ చేయాలంటే అయిదు లక్షలు ఖర్చవుతుంది.
వెంగళప్పు: ప్లాస్టిక్ నేను తెచ్చుకుంటాను. సర్జరీకి ఎంతవుతుంది.

అవకాశం



సావిత్రి: నా భర్త రాత్రి నిద్రలో మాట్లాడుతున్నాడు దీనికి పరిష్కారం చెప్పండి డాక్టర్
డాక్టర్: పగటి పూట ఆయనకి మాట్లాడే అవకాశం ఇవ్వండి చాలు...

104

అప్పారావు: శ్రీను 104ని తెలుగులో ఏ మంటార్రా...
సుబ్బారావు: ఒకటి కాదు నాలుగు అంటారు

లక్షణాలు

టీచర్: రాము గ్యాస్ లక్షణాలని చెప్పు
రాము: ఇంట్లో వుంటే కడుపు నిండుతుంది. ఒంట్లో ఉంటే డాక్టర్ జేబు నిండుతుంది.

ఏ పరీక్ష

అప్పుడే పరీక్ష రాసొచ్చిన ఇద్దరు స్టూడెంట్స్ మాట్లాడుకుంటున్నారు
చింటు: ఇంతకీ మనం రాసొచ్చింది ఏ పరీక్ష రా?
బంటి: బహుశా...మ్యాథ్స్ పరీక్ష అనుకుంటా ....ఎందుకంటే నా ముందు కూర్చున్న వాడు అదే పనిగా వేళ్లు లెక్కేస్తున్నాడు.

హోమ్‌వర్క్

టీచర్: చంటి ఈ రోజు హోమ్‌వర్క్ ఎందుకు చేయలేదు?
చంటి: నేను నిన్నటి నుండి హాస్టల్లో ఉంటున్నాను టీచర్

కిసుక్కు

టీచర్: ఎనిమిదిలో సగం ఎంత?
బంటి: అడ్డంగా అయితే సున్నా. నిలువుగా అయితే మూడు మేడమ్!



కోడి ఈకలతో కితకితలు పెడితే మీరు దడుసుకుంటారా..? కోడి ఈకలనే కాదు ఏ పక్షి ఈకలు కనిపించినా పరుగెత్తి ఇంట్లో దూరి తలుపేసుకుంటారా? టెరానో ఫోబియా ఉన్న వాళ్ళు ఇలానే చేస్తారు. ఏవైనా ఈకలతో కితకితలు పెడితే వీళ్లు చాలా భయపడిపోతారు. అలానే సరదా అంటే భయముంటే దాన్ని చెరోఫోబియా అనాలి. ఎవరన్నా తమను చూసి నవ్వుతారనే భయాన్ని గెలాటోఫోబియా అంటారు.

కిసుక్కు సిత్రం

ఏందిరా గుడ్లురిమి చూస్తున్నావ్..! మరెలా చూడాలి..? మానాన్న నన్ను వదిలి నిన్ను ఎత్తుకుంటే..!

అట్టమీది కథ

భళారే బాలల చిత్రం

నవంబర్ నెల వస్తే పిల్లలందరూ మహా సరదాగా కనిపిస్తారు. పట్టణాల్లో ఏ రోడ్డు చూసినా పిల్ల సైన్యం కవాతులు... బస్సుల్లో, ఆటోల్లో, కారుల్లో...ఒకటేమిటీ, ప్రతి వాహనం బారులు... వీళ్ళంతా ఎటెళ్తున్నారూ? అని వెంట వెళితే, చివరికి సినిమా థియేటర్ల ముందు ఆగుతారు. అక్కడంతా కోలాహలం... నవ్వులూ, కేరింతలూ... అందరి ముఖాల్లో చెప్పలేనంత ఆనందం పొర్లిపోతూ ఉంటుంది. స్కూల్ డ్రస్సుల్లో కొందరు, రంగురంగుల బట్టల్లో కొందరు... పడుతూలేస్తూ... తలలెత్తి పెద్దపెద్ద పోస్టర్లు చూస్తూ కొందరు పిల్లలు తమలో తాము నవ్వుకుంటుంటే, మరికొందరు పక్కనున్న స్నేహితులతో సినిమా కబుర్లు చెబుతూ సందడి చేస్తుంటారు... నవంబరు 14న దేశమంతా జరుపుకునే బాలల దినోత్సవ వాతావరణం సినిమా థియేటర్ల దగ్గరే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ హడావిడికి కారణం, బాలల సినిమాలను నిర్మిస్తున్న చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ఇండియా (సిఎఫ్ఎస్ఐ) నిర్వహించే చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్స్. వాటి విశేషాలే ఈ వారం అట్టమీది కథ.

– ప్రవీణ్ వెలువోలు
9959046997



సాధారణంగా నవంబరు నెలలో దేశంలోని చాలా నగరాల్లో పిల్లల హడావిడి కనిపిస్తుంది. ఈ నెల 14వ తారీఖున జరుపుకునే బాలల దినోత్సవం ఒక కారణమైతే, దాన్ని పురస్కరించుకుని నిర్వహించే బాలల చిత్రోత్సవాలు కూడా ముఖ్యమైన కారణమే. ఈ మధ్య కాలంలో పిల్లలపై సినిమాలు చూపిస్తున్న ప్రభావం మరే ఇతర మాధ్యమాలు చూపించడంలేదనేది అక్షరాలా సత్యం. ఎందుకంటే సినిమా కేవలం కదలాడే బొమ్మ మాత్రమే కాదు. సంగీతం, సాహిత్యం, అందం, అనుభూతి... ఇలా చెప్పుకుంటూ పోతే, మనం చెప్పుకునే అరవై ఆరు కళల్లో చాలా కళలు ఒకే చోట కనువిందు చేసే అద్భుత దృశ్యం చలనచిత్రం. ఇలాంటి ప్రత్యేకత ఉన్న సినిమా ఎలాంటి వారిపైనైనా ప్రభావం చూపకమానదు. అందుకే ఈమధ్య స్కూళ్ళు, కాలేజీల్లో కూడా సినిమాలు చూపిస్తున్నారు. అయితే అన్ని చలనచిత్రాలు అందరూ చూడాలనడం పొరపాటే. అందుకే బాలల కోసం ప్రత్యేకమైన సినిమాలు రూపుదిద్దుకుంటున్నాయి.

1949లో దేశంలో ఏర్పాటైన 'ఫిల్మ్ ఎంక్వైరీ కమిటీ' ప్రతిపాదన ప్రకారం, బాలల కోసం విలువలతో కూడిన ఆహ్లాదం అందించే బాలల చిత్రాలు నిర్మించాల్సిన అవసరం ఉందనే నిర్ణయాన్ని అందరూ హర్షించారు. ప్రభుత్వం ఆదేశంతో 1955 ఏప్రిల్ 30న చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఇండియా ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటికీ వందల బాలల చిత్రాలను నిర్మిస్తుంది. బాలల చిత్రాలు నిర్మించాలనుకునే వారికి సహకారం అందిస్తోంది. అంతేకాక, బాలల వికాసం కోసం వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయడం కోసం వర్క్‌షాపులూ ఏర్పాటుచేస్తోంది. అన్నింటికంటే ముఖ్యంగా సంవత్సరం పొడవునా వివిధ ప్రాంతాల్లో బాలల చలన చిత్రోత్సవాలను నిర్వహిస్తోంది. ప్రతీ సంవత్సరం నవంబరు 14 బాలల దినోత్సవం సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో బాలల చలన చిత్రాలను ప్రదర్శించి, లక్షల మంది బాలలకు సినిమాను దగ్గర చేస్తోంది.

జాతీయ బాలల చలనచిత్రోత్సవం

జాతీయ బాలల చలన చిత్రోత్సవం అనేది నిరంతరం









కొనసాగే 'ట్రావెలింగ్ ఫెస్టివల్'. చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఇండియా స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని, 2006లో బాలల దినోత్సవంనాడు మొదటి జాతీయ బాలల చలనచిత్రోత్సం ఢిల్లీలో మొదలైంది. అప్పటి నుంచి ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి 'జాతీయ బాలల చలన చిత్రోత్సవం' నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం, రెండవసారి నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ బాలల చిత్రోత్సవం, బాలల దినోత్సవంనాడు, అంటే నవంబరు 14 నుండి ప్రారంభం కాబోతుంది. పింక్ సిటీగా పేరొందిన జైపూర్‌లో నిర్వహించబోయే ఈ చిత్రోత్సవం స్థానిక టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇస్తోంది. భారతదేశంలో చిత్రీకరించిన చిత్రాలను బయటకు తీసుకురావడమే దీని ఉద్దేశం. దానితోపాటు వ్యాపారాత్మకంగా బాలల చిత్రాల పరిధిని అంతర్జాతీయ స్థాయికి పెంచడం. ఈ సంవత్సరం జరుగుతున్న చిత్రోత్సవంలో భారతీయ చిత్ర దర్శకులు రూపొందించిన 40 చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు నిర్వహణా వర్గాలు తెలియజేసాయి. ఈ ప్రదర్శనలో ఇంతకు ముందు మంచి పేరుప్రఖ్యాతులు సాధించిన బాలల చిత్రాలతోపాటు సిఎఫ్‌ఎస్‌ఐ నిర్మించిన చిత్రాలను కూడా ప్రదర్శిస్తారు. జైపూర్‌లోని బిర్లా ఆడిటోరియంలో ప్రారంభోత్సవం జరుపుకుంటున్న ఈ చిత్రోత్సవంలో భాగంగా జైపూర్ నగరంలోని 10 థియేటర్లలో, మూడు రోజుల పాటు వివిధ చిత్రాల ప్రదర్శన ఉంటుంది. రాజస్థాన్ నేపథ్యంలో రాం చోయల్ దర్శకత్వం వహించిన 'గౌరు' అనే సినిమా కర్టెన్ రైజర్‌గా ప్రారంభోత్సవంలో ప్రదర్శించబడుతుంది. ఈ చిత్రంలో గొర్రెలు మేపుకునే పదమూడేళ్ళ బాలుడు తన బామ్మ చివరి కోరికను తీర్చడానికి చేసే ప్రయత్నం కనిపిస్తుంది. తన బామ్మ పెళ్ళి చేసుకున్నప్పటి నుంచి పుట్టిన ఊరుకి ఒక్కసారైనా వెళ్ళలేకపోయాననే బాధలో ఉంటుంది. కొన్ని వేల కిలోమీటర్లు ఉన్న ఆమె ఊరు చేరుకోవడం చాలా కష్టమైన పని. కన్న కొడుకే ఏమీ చేయలేకపోతాడు. చివరి శ్వాస విడిచిన ఆ వృద్ధురాలి చివరి కోరికను తీర్చడానికి ఆ బాలుడు ఆమె పుట్టిన ఊరును వెతుక్కుంటూ బయలుదేరతాడు. మార్గంలో తాను ఎదుర్కున్న కష్టాలు, ఒడిదుడుకులు అధిగమించి, ప్రయాణాన్ని కొనసాగించిన గౌరూ, తన బామ్మ చివరి కోరికను తీర్చిన విధానమే ఈ చిత్ర కథ. ఈ చిత్రోత్సవంలో కేవలం చిత్రాలు ప్రదర్శించడమే కాకుండా చిన్నపిల్లల కోసం యానిమేషన్, కథా రచన, చిత్ర నిర్మాణం, నృత్యం, నాటకాలపై వర్క్‌షాప్‌లూ కూడా నిర్వహిస్తారు.

కదిలించే కథలు... కదలాడే నేపథ్యాలు

జాతీయ బాలల చలనచిత్రోత్సవాల్లో ప్రదర్శించే చిత్రాల్లో సిఎఫ్‌ఎస్‌ఐ నిర్మించిన వాటితోపాటు భారత దర్శకులు రూపొందించిన చిత్రాలు కూడా ప్రదర్శిస్తారు. వాటిలో కొన్నింటిని పరిచయం చేసుకుందాం... ఎమ్. మణికందన్ దర్శకత్వం వహించిన 'ది క్రోస్ ఎగ్' అనే చిత్రం టొరెంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై మంచి పేరు సంపాదించింది. అతి పేదరికంలో పుట్టిన ఇద్దరు పిల్లల కథ ఇది. రైల్వే పట్టాల పక్కన బొగ్గు ఏరుకుని అమ్మితే, రోజుకు వచ్చే పది రూపాయలే వారి సంపాదన. అయితే వారి నివాసానికి దగ్గర్లో ఉన్న పిజ్జా పార్లర్ ఉంటుంది. దాని తళుకుబెళుకులు, ఘుమఘుమలు వారిని ఆకర్షిస్తాయి. కానీ అందులో అడుగు పెట్టాలంటే, ఓ పిజ్జా తినాలంటే 300 రూపాయలు ఖర్చు పెట్టాలి. అది వారి నెల ఖర్చులకు సమానం. ఎప్పటికైనా ఆ పిజ్జా పార్లర్‌లో అడుగుపెట్టాలనే వారి కాంక్ష లక్ష్యమై వారితో ఏం చేయిస్తుందో అనే కథ చిన్న విషయంగా కనిపించినా ఆకర్షణలకు పసి మనసులు ఎలా స్పందిస్తాయో, ఎలాంటి సమస్యలుంటాయో వంటి జీవిత పాఠాలు నేర్పే అంశాలను, ఓ పిజ్జా విలువ చేసే చిన్నపాటి కుటుంబాల దీన పరిస్థితుల వంటి సామాజిక కోణాల్ని చాలా తేలికైన కథాంశంతో ఎంతో అర్థవంతంగా, అర్థమయ్యేలా మలిచారు.

అమ్మ విలువ

అంజులీ శుక్లా దర్శకత్వం వహించి, సొసైటీ నిర్మించిన చిత్రం "హ్యాపీ మదర్స్ డే". కాకు, విక్కీ ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన అన్నా చెల్లెళ్ళు. తమకు అమ్మపై ఉన్న ప్రేమను చూపించడానికి 'మదర్స్ డే' నాడు అమ్మకు మంచి బహుమతి ఇవ్వాలని నిశ్చయించుకుంటారు. దాని కోసం వారి దగ్గరున్న చిన్న చిన్న వస్తువులను అమ్ముతారు, రోజూ స్కూలుకు వెళ్ళడానికి ఖర్చయ్యే బస్ చార్జీలను దాచిపెట్టడానికి, దూరంగా ఉన్న స్కూల్‌కు నడిచి వెళతారు. ఎన్ని చేసినా వారు కొనాలనుకున్న బహుమతికి సరిపోయే డబ్బు సేకరించలేక పోతారు. చివరికి వీళ్ళు తప్పుగా అర్థంచేసుకున్న ఒక బాటసారి వలన తల్లి ప్రేమను దేనితోనూ కొలవలేమనీ, విలువ కట్టలేమనీ, ఆ ప్రేమకు ఎన్ని బహుమతులు ఇచ్చినా, ఎంత ఖర్చుచేసినా తక్కువేననీ అర్థంచేసుకుంటారు.

సబ్బు నురగలా...

ప్రమోద్ పాటక్ దర్శకత్వంలో 'పింటీ కా సాబున్' అనే హిందీ చిత్రాన్ని సొసైటీ నిర్మించింది. ఈ సినిమాలో నటించిన కొందరు బాల నటులు డెహ్రాడూన్‌లోని పురాతన ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలు. మరికొందరు చాలా పేదరికం నుంచి వచ్చిన పిల్లలు. కొండల్లో నివసించే ఒక అబ్బాయి గ్రామోత్సవంలో పాల్గొని ఒక సబ్బును బహుమతిగా పొందుతాడు. ఆ సబ్బు వాసనకు చిన్నప్పుడు తనతో కలిసి ఆడుకున్న మిలటరీ అధికారి కూతురు పింటీ గుర్తుకొస్తుంది. తన అనుభూతులను స్నేహితులతో, కుటుంబ సభ్యులతో పంచుకోకముందే ఆ సబ్బు కరిగిపోతుంది. అప్పుడు తన చుట్టూ ఉన్న ప్రపంచం కూడా ఆ సబ్బులా నాసిరకంగా తోస్తుందతనికి. సొసైటీ నిర్మించిన మరో చిత్రం, జౌలా ఛంగ్తే దర్శకత్వం వహించిన 'కిమస్ లోడి' అనే చలనచిత్రం. ఇది మిజోరాంలో నివశిస్తూ, తప్పిపోయిన ఒక సాహస బాలుడి గురించి తెలియజేస్తుంది. హేమంత్ కుమార్ దర్శకత్వం చేపట్టిన 'భలే చాయ్ బోయ్' అనే కన్నడ చిత్రంలో చాయ్ అమ్ముకునే ఒక బాలుడు, ఎన్నో కష్టాలకు ఓర్చి, అందరూ గర్వించే విధంగా గొప్ప చెస్ ఛాంపియన్‌గా ఎదిగే ప్రయత్నం కనిపిస్తుంది.

'అమూల్యం' అనే తెలుగు చిత్రం దర్శకుడు అక్కినేని కుటుంబరావు. పట్టణ వాతావరణంలో పెరిగిన ఒక పాప, పల్లెటూరి వాతావరణాన్ని ఎలా అర్థం చేసుకుంటుందీ, ముసలివారిగా ఉన్న నానమ్మ, తాతయ్యల ప్రేమను ఎంత అమూల్యంగా స్వీకరించిందో ఈ చిత్రం తెలియజేస్తుంది. అలాగే

'నాటౌట్', 'సాటర్‌డేస్ షోర్', 'అభయ్', 'అళిగళు', 'ఆస్మాన్ సే గిరా', 'పప్పు కీ పుగ్డండీ', 'షార్ట్‌కట్ సఫారీ', 'ది గోల్', 'మహెక్ మిర్జా', 'క్రిష్ త్రిష్' వంటి చాలా చిత్రాలు ఈ చిత్రోత్సవంలో పిల్లలను అలరించబోతున్నాయి. కె.ఎన్.టి.శాస్త్రి దర్శకత్వంలో వచ్చిన 'శాణు' అనే తెలుగు చిత్రాన్ని సిఎఫ్ఎస్ఐ నిర్మించింది. ఎప్పుడూ ఆశావాదిగా ఉండే ఒక పాప, జీవితంలో అన్నింటికంటే ముఖ్యం నమ్మకమే అని నమ్ముతుంది. కొన్నాళ్ళకి మనిషికి నమ్మకం ఒక్కటీ ఉంటే సరిపోదూ, నమ్మకాన్ని నిజం చేసుకోవాలంటే కష్టపడాలని తెలుసుకుంటుంది. తనకు ఇష్టమైన 'ఖో ఖో' ఆ క్రీడలో ఉన్నతమైన స్థానాన్ని వెళ్ళడానికి నిరంతరం కృషి చేస్తుంది. మ్యాచ్‌లో ఓడిపోతుంది కానీ జీవితంలో 'ఖో ఖో' ఆటను విడిచిపెట్టనని నిశ్చయించుకుంటుంది.

బాల దర్శకుడు

కిషన్ శ్రీకాంత్ కర్నాటకు చెందిన బాల నటుడు, బాల దర్శకుడు కూడా. కిషన్ చాలా చలనచిత్రాల్లో నటించాడు. వీటితో పాటు 300 ప్రముఖ భారతీయ ధారావాహికల్లో పాల్గొన్నాడు. 2006 నవంబరులో విడుదలై, కర్నాటకలో 100 రోజులు ఆడిన 'కేరాఫ్ ఫుట్‌పాత్' అనే కన్నడ బాలల చిత్రానికి దర్శకత్వం వహించి, అత్యంత చిన్న వయస్సుగల చిత్రదర్శకుడిగా కిషన్ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. ఈ సినిమా కథ కూడా కిషన్ స్వయంగా రాసినదే. కొంతకాలానికి ఆ కథనే సినిమాగా తీశాడు. స్కూల్‌కి వెళ్ళి చదువుకోవాలని ఆశపడే ఒక అనాథ బాలుడి కథే ఈ చిత్రం. ఫుట్‌పాత్‌పై నివసించే బాలుణ్ని కొందరు విద్యార్థులు 'చదువురాని మూర్ఖుడా' అని తిడతారు. అప్పటి నుంచి ఆ బాలుడు ఎలాగైనా చదువుకోవాలని నిశ్చయించుకుంటాడు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఆ బాలుడు చదువుకున్న తీరునే ఈ సినిమాలో చూపించాడు బాలదర్శకుడు కిషన్. అంతర్జాతీయంగా చాలా అవార్డులు అందుకున్న ఈ చిత్రంలో కిషన్ ప్రధాన పాత్ర పోషించాడు. ప్రముఖ నటుడు జాకీ ష్రాఫ్, సౌరభ్ శుక్లా, బి.జయశ్రీ, సుదీప్, తారా కూడా ఈ చిత్రంలో నటించడం విశేషం. అంతేకాక ఈ చిత్రాన్ని ఐదు భారతీయ భాషల్లో డబ్బింగ్ చేశారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి కర్నాటక ప్రభుత్వం నుంచి సత్కారాన్ని అందుకున్నాడు. పదహారేళ్ళ వయస్సులో ప్రభుత్వ అనుమతితో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ మల్టీమీడియా అండ్ యానిమేషన్‌లో మాస్టర్స్ డిగ్రీలో చేరి, అతి చిన్న వయస్సులో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన వ్యక్తిగా రికార్డును సృష్టించాడు. బాలీవుడ్ నటి కరీష్మాకపూర్ కుమార్తె, పదేళ్ళ సమైరా 'బి హ్యాపీ' అనే షార్ట్‌ఫిల్మ్ రూపొందించింది. ఈ చిత్రం గత ఏడాది నిర్వహించిన 19వ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవంలో 'లిటిల్ డైరెక్టర్స్' విభాగంలో ప్రదర్శించారు. ఈ చిత్రంలో సమైరా నటించడంతోపాటు సినిమాటోగ్రాఫర్‌గా కూడా కీలక పాత్రను తీసుకుంది. ఎడిటింగ్, స్క్రిప్టింగ్‌లోనూ తన వంతు పాత్రను నిర్వర్తించింది. ఈ చిత్రం 'మనకున్నదానితోనే మనం తృప్తిగా ఉండాలి' అనే సందేశాన్ని ఇస్తుంది. ఒక పాప షాపింగ్ చేయడానికి వెళ్ళి, అక్కడ ఖరీదైన వస్తువులు కొంటున్న పిల్లల్ని చూసి అసూయపడుతుంది. తనకు అంత ఖర్చుచేసే స్థోమత లేదని బాధపడుతుంది. చివర్లో తాను వేసుకున్న జాకెట్ లాంటిది మరో పిల్ల తీసుకోవాలని ప్రయత్నిస్తుంది. 'అయితే నన్ను చూసి మరొకళ్ళు అసూయపడుతున్నారు కదా!' అనుకుంటుంది. అప్పుడు ఈ పాప తాను ఇతరులను చూసి అసూయచెందడం తప్పు అని అర్థం చేసుకుంటుంది.

సిఎఫ్ఎస్ఐ కార్యక్రమాలు

రెండేళ్ళకు ఒకసారి నిర్వహించే అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవంతో పాటు, జాతీయ బాలల చలనచిత్రోత్సవాలూ, ప్రాంతీయంగా బాలల చిత్రాల ప్రదర్శనలు ఇస్తూ పిల్లల్ని ఉత్తేజితుల్ని చేస్తోంది సిఎఫ్ఎస్ఐ. అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవానికి 'ది గోల్డెన్ ఎలిఫెంట్' అనే పేరు అంతర్జాతీయంగా వాడుతుంటారు. సొసైటీ చిత్రోత్సవాల్లో భాగంగా కేవలం చిత్రాలు ప్రదర్శించడమే కాకుండా సినిమాకి సంబంధించిన వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుంది. ఎంతో బలమైన మాధ్యమంగా మారిన చలనచిత్రాల ద్వారా చిన్న పిల్లల్లో ఉత్సాహాన్ని నింపి, మానవీయ విలువలను తెలియజేస్తూ, మంచి ఎంటర్‌టైన్‌మెంట్ అందించడమే ఈ చిత్రోత్సవాల ఉద్దేశంగా సిఎఫ్ఎస్ఐ పనిచేస్తోంది. 'జాతీయ బాలల చలన చిత్రోత్సవం' పేరుతో వివిధ రాష్ట్రాల్లో పర్యటించి, బాలలందరికీ ఆరోగ్యకరమైన చిత్రాలను చూపిస్తూ, పిల్లల్ని చిత్ర నిర్మాణం వైపు ప్రోత్సహించి, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. దానితోపాటు బాలల చిత్రాలను రూపొందించే వారికి అవకాశం కల్పించడం సొసైటీ కార్యకలాపాల్లో ప్రధానమైనది. దానిలో భాగంగా బాలల సినిమాలు, షార్ట్ ఫిల్మ్స్, పప్పెట్ ఫిల్మ్స్, టీవీ సీరియల్స్‌ను నిర్మిస్తుంది. ఇతరులు నిర్మించిన చిత్రాలకు ప్రదర్శనా హక్కులను కూడా తీసుకుంటుంది. చెన్నై, ఢిల్లీలో ఉన్న సొసైటీ శాఖల ద్వారా ప్రాంతీయంగా చిత్రాలను ప్రదర్శిస్తుంది. స్కూళ్ళు, థియేటర్లలో చిత్రాలను ప్రదర్శించుకోవడానికి వ్యక్తులకైనా, సంస్థలకైనా చిత్రాలను అద్దెకు ఇస్తుంది.

సిఎఫ్ఎస్ఐ కథ

1955లో భారత ప్రభుత్వం ఏర్పరచిన చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఇండియా (సిఎఫ్ఎస్ఐ) సమాచార మరియు ప్రసారాల మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో స్వయంప్రతిపత్తిగల సంస్థగా ఏర్పడింది. దేశీయతను చాటుతూ, బాలల కోసం ప్రత్యేకంగా ఉండే సినిమాలను నిర్మించాలన్నదే సొసైటీ ప్రధాన ఉద్దేశం. బాలల్లో సృజనాత్మకత, దయాగుణం, విమర్శనాత్మక ఆలోచనా సరళి ఏర్పరచాలనేది లక్ష్యం. 1957లో సిఎఫ్ఎస్ఐ నిర్మించిన 'జలదీప్' చిత్రం వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌ల్లో ఉత్తమ బాలల చిత్రంగా మొదటి బహుమతిని పొంది సొసైటీ అంతర్జాతీయంగా గుర్తింపును అందుకుంది. అప్పటి నుండి సిఎఫ్ఎస్ఐ వివిధ భారతీయ భాషల్లో చలనచిత్రాలను, షార్ట్ ఫిల్మ్‌ను, యానిమేషన్ చిత్రాలను, టీవీ కార్యక్ర మాలను, డాక్యుమెంటరీలను నిర్మిస్తూ, ప్రదర్శిస్తూ, డిస్ట్రిబ్యూట్ చేస్తుంది. 15 భాషల్లో 260 చిత్రాలకుపైన నిర్మించిన సిఎఫ్ఎస్ఐ దక్షిణ ఆసియాలో ప్రముఖమైన స్థానం సంపాదించుకుంది. ప్రతీ సంవత్సరం దేశం మొత్తం అన్ని రాష్ట్రాల్లోనూ చలనచిత్రాలను ప్రదర్శిస్తూ, ఏడాదికి 40 లక్షల మంది బాలలకు చేరువవ్వాలనే ప్రణాళిక రూపొందించుకుంది. సొసైటీ ప్రధాన కార్యాలయం ముంబయ్‌లో ఏర్పరచుకుని, చెన్నై, ఢిల్లీల్లో తమ శాఖలను ఏర్పాటుచేసింది. మృనాల్ సేన్, సత్యన్ బోస్, తపన్ సిన్హా, కె.అబ్బాస్, శ్యాం బెనగల్, ఎమ్.ఎస్ సత్యూ, సాయి పరాంజిపే, బుద్‌దేవ్ దాస్‌గుప్తా, సంతోష్ శివన్, రాం మోహన్, రితుపర్ణో ఘోష్, పంకజ్ అద్వాని వంటి ఒకప్పటి ఉద్దండ సినీ పండితుల నుంచి ఇప్పటి దర్శకుల వరకూ చాలామంది బాలల చిత్రాలు రూపొందిస్తున్నారు.



జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో బాలల చలనచిత్రాలు ప్రదర్శించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. దూరదర్శన్ ఇతర టీవీ ఛానళ్లలో సినిమాలను ప్రసారం చేస్తుంది. పట్టణాల్లో నివసిస్తున్న పేద పిల్లల కోసం, గ్రామాల్లో ఉన్న పిల్లల కోసం, ఆదివాసీల కోసం ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో కూడా సినిమాలు ప్రదర్శిస్తారు. నెలవారీ అద్దెతో ప్రాంతీయ డిస్ట్రిబ్యూటర్లకు చిత్రాలను ఇస్తారు. సిఎఫ్ఎస్ఐ నిర్మించిన చిత్రాలను వివిధ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాలకూ పంపుతారు. వీటితో పాటు సంవత్సరం పొడవునా ఏదో ఒక ప్రాంతంలో బాలల చిత్రోత్సవాలను నిర్వహిస్తూ ఉంటారు. ఈ మధ్య కాలంలో నార్త్ఈస్ట్ చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించి, అనేక ఉత్తమ చిత్రాలను ప్రదర్శించారు.

వెలుగు-నీడలు

ప్రపంచంలోనే అతి పెద్ద బాలల చలనచిత్రోత్సవంగా గుర్తింపు పొందిన ఈ చిత్రోత్సవ 19వ ఎడిషన్‌కు 2015లో 80 దేశాల నుంచి 1240 చిత్రాలు ప్రదర్శనకు వచ్చాయి. మెక్సికో, ఆఫ్ఘనిస్థాన్, స్విట్జర్లాండ్, యూఎస్ఏ, ఈజిప్ట్, పోర్చుగల్, స్వీడన్, కెనడా వంటి వివిధ దేశాల నుంచి వచ్చిన బాలల చిత్రాలు ఇక్కడ ప్రదర్శించారు. సుమారు రెండు లక్షలకు పైన బాలలు ఈ చిత్రాలను చూసి ఆనందాన్ని పొందుతారు. ఇలాంటి ఈ ఉత్సవానికి హైదరాబాదు శాశ్వత వేదికగా ఉండటం తెలుగువారికి గర్వకారణమనే చెప్పాలి. కాకపోతే తెలుగులో బాలల చిత్రాల నిర్మాణం ఎంతవరకూ కొనసాగుతుందో అందరికీ తెలిసిన విషయమే. అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవంలో భారతీయులు రూపొందించిన చిత్రాలకు ప్రత్యేకమైన విభాగం ఉంటుంది. కానీ బాధాకరమైన విషయం ఏంటంటే, భారతీయులు నిర్మించిన బాలల చిత్రాలు చాలా తక్కువగా వస్తున్నాయన్నది కనిపిస్తున్న నిజం. భారతదేశంలో బాలల సినిమాలు నిర్మించేవారే తక్కువయ్యారు. కొందరు నిర్మాతలు చిత్రాలు తీస్తున్నా వాటిలో చాలా వరకూ క్వాలిటీ కరవవుతుందని చాలా మంది అభిప్రాయం. దానివలన ఇతర దేశ బాలల చిత్రాలతో భారతీయ చిత్రాలు పోటీ పడలేకపోతున్నాయి. అందుకే భారతీయ సినిమాల విభాగాన్ని 'ఆసియా విభాగం'గా మార్చి, మరింత పోటీ తత్వాన్ని ఇచ్చే ప్రణాళికను రూపొందించారు సొసైటీవారు. భారతీయ బాలల చిత్రాల్లో క్వాలిటీని తీసుకురావడానికి చిత్రనిర్మాణంలోకి పిల్లల్ని ఆహ్వానించడం ప్రస్తుతం ఆవశ్యకమయ్యింది. వారి ఆలోచనల్లో, అనుభవాల్లో, అనుభూతుల్లో ఉన్న కథలను సినిమా మాధ్యమంలో బయటకు తెచ్చే విధంగా పిల్లలు తయారవ్వడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడంపై సొసైటీ దృష్టి పెట్టింది. అందుకే 2013లో నిర్వహించిన 18వ గోల్డెన్ ఎలిఫెంట్ కేటగిరీలో 'లిటిల్ డైరెక్టర్స్' అనే విభాగాన్ని మొదలుపెట్టారు. ఆ సంవత్సరంలో భారతదేశం నుంచి విజయవంతంగా 123 చిత్రాలు ఎంట్రీలు పొందాయి. తర్వాత నిర్వహించిన 19వ గోల్డెన్ ఎలిఫెంట్‌లో 'లిటిల్ డైరెక్టర్స్' విభాగంలో అంతర్జాతీయంగా 8 దేశాల నుండి 200 ఎంట్రీలు రావడం కొంత వరకూ ఊరట కల్గిస్తుంది. బాలీవుడ్, ఇతర ప్రాంతీయ చిత్ర పరిశ్రమలు బాలల సినిమాపై ఎక్కువ శ్రద్ధ చూపకపోవడం ఒక విధంగా శోచనీయం. బాలల చిత్రాల్లో వాణిజ్యపరమైన అంశాల లోపం వలన విజయం సాధించలేకపో తున్నాయనే ఉద్దేశం ఉండటం వలన బాలల చిత్రాలు నిర్మించాలనుకునే ఉత్సాహవంతులు కూడా వెనకడుగు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కానీ గత దశాబ్దాల్లో వచ్చిన కొన్ని బాలల చిత్రాలు బాక్సాఫీస్ వద్ద గొప్ప విజయాలను సాధించాయని చాలా మంది మరిచిపోతున్నారు. 'తారే జమీన్‌పర్', 'మక్ఖీ', 'చేతన్', 'లిటిల్ సోల్జర్స్', 'నాన్న' వంటి ఎన్నో చిత్రాలను ప్రేక్షకులు ఆదరించారన్నది రుజువైన నిజం. అద్భుత మైన చిత్రాలను నిర్మించే సత్తా ఉన్న యువకులు మన దేశంలోనూ, మన రాష్ట్రంలోనూ ఉన్నారు. 'నేటి బాలలను రేపటి మంచి పౌరులుగా' తీర్చిదిద్దడానికి... ఎప్పుడో 'నూటికీ, కోటికీ ఒకటి' అన్నట్లు కొనసాగుతున్న బాలల చిత్రాల నిర్మాణం ఇప్పటికైనా కొత్తవేళ్లను కొని, సరికొత్తగా ఆబాలగోపాలానికి ఆరోగ్యక రమైన ఆహ్లాదాన్ని పంచుతుందని ఆశిద్దాం. ✦

లోపాలున్నాయి

సిఎఫ్ఎస్ఐ కార్యకలాపాల్లో లోపాలున్నాయనీ, అవినీతి ఎక్కువగా ఉందనే అపవాదులు లేకపోలేదు. నిర్వాహకుల బంధుప్రీతి వలన చిత్ర నిర్మాణానికి సంబంధించిన వనరులు సక్రమంగా వినియోగించడంలో విఫలమవుతున్నారన్న వాదన బలంగా ఉంది. సొసైటీ కార్యకలాపాలను పరిశీలించడానికి 1967లో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ ఇచ్చిన సలహాలూ, సూచనలు అప్పట్లో మంచి ఫలితాలను ఇచ్చాయి. కానీ విచారణ పూర్తి స్థాయిలో జరగలేదు. 1974-75 మధ్య కాలంలో సొసైటీలో చాలా మంది అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. దాని కారణంగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను మార్చాల్సిన అవసరం ఏర్పడింది. ఆ తర్వాత కాలంలో కూడా సిఎఫ్ఎస్ఐ ఎన్నో ఒడిదుడుకులకు లోనయ్యింది. ఛైర్‌పర్సన్‌లు, కార్యదర్శులు మారుతూ వచ్చారు. నిర్మించాల్సిన సినిమాల ఎంపికలో కూడా లోటుపాట్లు జరిగాయి. 'ఫుట్‌బాల్ మ్యాచ్' అనే చిత్రాన్ని రూపొందించింది అప్పటి సొసైటీ ఛైర్‌పర్సన్ కామినీ కౌశల్ కుమారుడు.





పన్ను ఉంగరం

ఊడిపోయిన పళ్లతో చెవి దిద్దులు తయారు చేసిస్తే వేసుకుంటారా? ఆలోచిస్తున్నారా? కానీ నెదెర్‌ల్యాండ్స్‌కు చెందిన డిజైనర్ లూసీ మజెరస్ మాత్రం డజన్ల కొద్దీ డిజైన్లను ఈపాటికే మార్కెట్‌లో పెట్టేసింది. ఏనుగు దంతాల ఆభరణాల వల్ల ఆ జాతి అంతరించిపోయే పరిస్థితికి వెళుతోందని, అదే మనిషి పళ్లతో ఎందుకు నగలు చేయకూడదని ఆలోచన తట్టిందట. అది కూడా ఆమె జ్ఞాన దంతం ఊడి పడినపుడు టక్కున బుర్రలో వెలిగిందట. కొన్ని రోజుల పాటు తన దంతాన్ని తన దగ్గరే దాచుకుని ఎలాంటి డిజైన్ చేస్తే బాగుంటుందా అనుకుని దాన్ని ముత్యంలా తొలచి ఉంగరాన్ని రూపొందించింది. ఇది బాగా నచ్చిన వారు తమ ఊడిన పళ్లను కూడా తీసుకొచ్చి చెవి దిద్దులు, కాలర్ పిన్నులు, కఫ్ గుండీలు వంటి వగైరా వగైరాగా మార్చేసుకుని అలంకరించుకుంటున్నారు. పళ్లను శుభ్రం చేసి, బ్లీచ్ చేసి, నగిషీ పెట్టి గుండ్రంగానో, బియ్యం గింజ ఆకారంలోనో మారుస్తుంది. గుర్తు పట్టి అడిగేంత వరకు అవి పళ్ళని అర్థం కావు. ఏనుగుదైనా, మనిషిదైనా పన్ను పన్నే కదా...! ఏనుగులనైతే చంపి తీస్తారు కానీ మనిషివి మాత్రం ఊడిన పళ్ళనే ఉపయోగిస్తాం అని సమర్థించుకుంటోంది.

సిగ్గరులకు మాత్రమే

కొంతమందికి పెళ్లి చూపులన్నా, అస్సలు అమ్మాయి/అబ్బాయితో మాట్లాడాలన్నా తెగ సిగ్గు. ఇక వీరు కూర్చుని మాట్లాడుకునేదెలా, ఒకరికొకరి ఇష్టాయిష్టాలు, అభిరుచులు పంచుకునేదెలా? ఇక్కడేమో గానీ జపాన్‌లో మాత్రం ఇలాంటి సిగ్గు మొగ్గలకు మంచి పరిష్కారంతో ముందుకొచ్చిందో వివాహ సంబంధాల సంస్థ. వారి కొన్కట్సూ అదేనండి పెళ్లిళ్ల వేటకు సర్జికల్ మాస్క్‌ని ఉపయోగిస్తోంది. జపాన్‌లో మాస్క్ ధరించి నడిరోడ్లపై తిరగడం ఎప్పటి నుంచో ఉంది. కాలుష్యం నుంచి తప్పించుకునేందుకు, అంటువ్యాధుల భయం, ముఖానికి వెచ్చదనం కోసం ఇలా రకరకాల అవసరాలకు మాస్క్‌లు ధరిస్తుంటారు. దీన్నే తగిలించి పెళ్లి చూపుల్లో కూర్చోబెడుతోంది సంస్థ. ముందే ముఖం చూపిస్తారులెండి. తర్వాత మాటలు ఇతరత్రా చర్చలపుడు మాస్క్ వేయించి కూర్చోబెడతారు. దీనివల్ల మరో ప్రయోజనం ఉందని కూడా చెబుతున్నారు. అదేంటంటే మాస్క్ ధరించడం వల్ల బాహ్య సౌందర్యం మీద దృష్టి పెట్టకుండా అభిరుచులు, కెరీర్, జీవిత విలువలు ఇలా ఓ బంధాన్ని దృఢం చేసే అసలు సిసలు విషయాలపై ధ్యాస పెరుగుతుందట. సిగ్గు మరీ ఎక్కువైనా కష్టమే.

వింత లోకం

నిద్రపుచ్చే సిత్రాలు

కొన్ని సినిమాలు చూస్తుంటే తెలీకుండానే నిద్రొచ్చేస్తుంది. పక్కనోడు తట్టిలేపినా గుర్రుమని గురకపెట్టే సందర్భాలు చూస్తుంటారు. అలాంటి చిత్రాల్నే టీవీలో చూపించి నిద్రపుచ్చుతామంటోంది నాప్‌ఫ్లిక్స్. వీరి వీడియో స్ట్రీమింగ్‌లు ఎలాంటి వారికైనా కునుకు తెప్పిస్తాయని అంటోంది. వీటిల్లో ఉండే కంటెంట్‌లో ఎక్కువ నిశ్శబ్దంగా, నిదానంగా సాగే విషయాలుంటాయట. మెదడును ప్రశాంతపరిచే ప్రోగ్రామ్‌లు కావడంతో త్వరగా నిద్రలోకి జారుకుంటారట. సాగదీసిన లెక్చర్‌లు, డాక్యుమెంటరీలు, అర్థంపర్థంలేని ఆటల సిమ్యులేషన్‌లు,నిదానంగాసాగే చదరంగం పోటీలు, మెల్లిగా మారే ప్రకృతి దృశ్యాలు, మత తంతులు ఇలా ఏవైతే ఆవలింతలు తెప్పిస్తాయో వాటినే ఎంచుకుని చూడొచ్చు. ఇప్పటికే దొరికే వీడియోలకు తోడు ఈ సంస్థ కూడా కొన్ని ప్రత్యేకమైన వీడియోల్ని రూపొందించింది. అలా ముందుగా చేసిందే 'సబ్‌వే'. ఇదో రైలు ప్రయాణానికి సంబంధించినది. న్యూయార్క్‌లోని కెనాల్ స్ట్రీట్ నుంచి కోనీ ఐల్యాండ్ వరకు సాగే ఆ ప్రయాణం బాగా బోర్ కొట్టిస్తుందట. ప్రయాణం చేసేవారికే కాదు చూసే వారికి కూడా. మరి నిద్రపోతే టీవీ ఆఫ్ చేయడం ఎలా. టైమర్ ఉంది కదా. మా వీడియోలకు కూడా టైమ్ సెట్ చేసుకోవచ్చు అంటోంది. దీని వీడియోల్లో బాగా మత్తు కలిగించేవి 'ది వాకింగ్ పిగ్', 'ది యాపిల్ ఫార్మ్', 'ది వండర్ వరల్డ్ ఆఫ్ టప్పర్‌వేర్'. వీటి అవసరం ఎందుకంటే చాలామంది రాత్రిళ్లు నిద్ర పట్టడంలేదని టీవీలకు అతుక్కుపోతారు. అది మరింత నిద్రలేమిని కలిగించి మొత్తానికే మోసం వస్తుంది.

దమ్మున్న రేసర్స్

విజేత

ఎడారి తుఫానులతో తలపడే కార్ల వేగం. పర్వతాల వంపుల్లో గుండెల్ని వణికించే మెకానికల్ బీస్ట్‌ల రయ్..మనే శబ్దం. ఇదంతా డెసర్ట్ స్టార్మ్, రైడ్ ది హిమాలయ కారు రేసుల్లో ఓ క్షణం. రేస్ కార్లు పర్వతాలను ఢీకొంటున్నట్లు, ఇసుక తిన్నెల్ని చీల్చేస్తున్నట్లు ఓ వైబ్రేషన్. బయటి నుంచి చూడ్డానికి థ్రిల్లింగ్ అనిపించినా రేస్ డ్రైవర్ పక్క సీటులో ఓ పదినిమిషాలు గడిపితే చాలు పర్వతాలు లోయలుగా, ఎడారులు నీటి ప్రవాహాల్లా భ్రమ కల్పిస్తూ కళ్లు గిర్రున తిరుగుతాయి. అడ్రినలిన్ రష్ వేగాన్ని దాటేసే ఈ రసవత్తర రేస్‌ల్లో రాక్‌స్టార్ సురేష్ రాణా. అతడి న్యావిగేటర్ అశ్విన్ నాయక్. ఫోర్ వీలర్ ఎక్స్‌ట్రీమ్ రేసుల్లో రాణా కెరీర్ సర్రున ఎత్తుకు దూకేస్తోంది. అది కిందకు పడకుండా న్యావిగేట్ చేస్తున్నాడు అశ్విన్. ఈ విజేతలు హిమాలయాల్ని మరోసారి రైడ్ చేయబోతున్నారు.

ఉత్తర హిమాచల్‌ప్రదేశ్‌లో రైడ్ ది హిమాలయ' ఫోర్ వీలర్ ఎక్స్‌ట్రీమ్ రేసింగ్‌కి ఉన్న క్రేజ్ అలాంటిలాంటిది కాదు. రేసింగ్ సాహసవీరులు కథలు కథలుగా చెప్పుకునే మంచు లోకపు అపాయకర పోటీ ఇది. ప్రత్యర్థితో పాటు ప్రకృతి, వాతావరణం, యంత్రం... ముఖ్యంగా తనతోను తలపడే సాహసి ప్రయాణమది. ప్రమాదాలతో సావాసం చేసే ఎక్స్‌ట్రీమ్ రేసర్ గమనమది. స్విట్జర్‌ల్యాండ్ ఎఫ్ఐఎమ్ ఆఫ్-రోడ్ మోటర్ స్పోర్ట్స్ క్యాలెండర్‌లో దేశం తరుపున చోటుదక్కింది కూడా రైడ్‌ది హిమాలయకి మాత్రమే. ఈ సీజన్ మొదలైంది. తీవ్రమైన చలి వాతావరణం, తక్కువ పరిమాణంలో ఆక్సిజన్ లభించే ఎత్తైన కొండ ప్రాంతాల్లో వేలమైళ్ల దూరాలు రేస్ కార్లతో దూసుకుపోవడం పెద్ద సవాల్ లాంటిది. ప్రతి ఏటా హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లా నుండి ప్రారంభమయ్యే ఈ పోటీలకి సందర్శకుల రద్దీ పెరగడంతో ఈసారి వీటిని మనాలిలో నిర్వహించనున్నారు. ఈసారి కూడా అందరి అంచనాలు ఏస్ ర్యాలీయిస్ట్ సురేష్ రాణా(42) అతడి న్యావిగేటర్ అశ్విన్ నాయక్(39)లపైనే ఉన్నాయి.

జీవితమూ రఫ్ అండ్ టఫ్ఫే...

హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలోని ఓ మారుమూల గ్రామం కర్జన్. ఇక్కడి ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు రాణా. చిన్నతనం నుండే టివిలో వచ్చే రేసింగ్ క్రీడలని చూస్తూ ఈ క్రీడకి అభిమానిగా మారాడు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న తండ్రి నెల జీతం కుటుంబ అవసరాలకి సరిపోక యాపిల్ తోటల్లో, వర్క్‌షాపుల్లో పనిచేయడానికి డిగ్రీ రెండో సంవత్సరంలో చదువు మానుకున్నాడు. 2001లో మనాలిలోని కున్జుమ్ మార్గంలో కాజా వద్ద ఓ రోజు మారుతి జిప్సీ కారు నుండి దిగుతున్న రాణా అప్పటి రైడ్ ది హిమాలయ' నిర్వాహకుడు మన్‌జీవ్ భల్లా దృష్టిలో పడ్డాడు. రేసింగ్ కార్ కాకపోయినా జీప్సీని నిర్దిష్టమైన రేసింగ్ లైన్‌లో నడిపిన తీరు తనని ఆకట్టుకోవడంతో రైడ్ ది హిమాలయ' గురించి రాణా దృష్టికి తీసుకెళ్లాడు మన్‌జీవ్. ఇరవై ఏళ్ల వయసులో తన అభిమాన క్రీడలో పాల్గొనే అరుదైన అవకాశం దక్కడంతో ఆ ఏడాది నిర్వహించిన పోటీల్లో పాల్గొని తన బృందంలో రెండో స్థానంతో పాటు మొత్తంగా ఆరో స్థానంలో నిలిచాడు. 2002లో నిర్వహించిన రైడ్ ది హిమాలయ పోటీల్లో మొదటి స్థానం రాణాదే. 2004 నుంచి 2008 వరకు రేసింగ్ ప్రపంచంలో వరుస విజయాలతో రాణా ఛాంపియన్‌గా నిలిచాడు. 2009లో తృటిలో టైటిల్ కోల్పోయినా మరుసటి ఏడాది మరింత పట్టుదలతో రేసింగ్ బరిలో కాలు మోపిన రాణా 2013 వరకు వరుస విజయాల్ని సొంతం చేసుకున్నాడు. గరుకైన పర్వత మార్గాల్లో నిర్వహించే పోటీలే కాదు ఎత్తుపల్లాల ఎడారి దారుల్లో నిర్వహించే రేసింగ్ పోటీల్లోనూ 2009, 2012, 2013, 2016 సంవత్సరాలకు గాను డెసర్ట్ స్టార్మ్ టైటిల్‌ని గెలుచుకున్నాడు రాణా.

జోడీ కుదిరింది

తొలినాళ్లలో తను పాలొన్న పోటీల్లో కో-డ్రైవర్ లేడు. కొందరు మిత్రులు మాత్రం న్యావిగేటర్లు(మార్గర్శకులు)గా ఉండేవారు. అనిశ్చిత వాతావరణంలో జరిగే రోడ్ రేసులు ఒక ఎత్తయితే ఒక్క తప్పు మలుపు తీసుకోవడం ద్వారా రేస్‌లో 20 కి.మీ పక్కదోవ పట్టే డెసర్ట్ స్టార్మ్ రేసులు మరో ఎత్తు. ఈ రకమైన పోటీల్లో ముందుకు సాగాలంటే నావిగేటర్లే కీలకం. అప్పట్లో రేసింగ్ కార్లు, ర్యాలీలపై చాలామందికి అవగాహన లేకపోవడంతో నావిగేటర్లని తరచూ మార్చాల్సి వచ్చేది. 1995లో రాణా కో-డ్రైవర్‌గా మంగుళూరుకి చెందిన అశ్విన్ నాయక్ పరిచయంతో ఇక రాణాకి వెనుదిరగాల్సి రాలేదు. మూడు రైడ్ ది హిమాలయ, రెండు డెసర్ట్ స్టార్మ్, ఐదు సజోబా ర్యాలీ వరుస విజయాలతోపాటు గరిష్ఠ ర్యాలీలు గెలుచుకున్న జతగా జాతీయస్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు. 2016లో నిర్వహించిన ఇండియన్ నేషనల్ ర్యాలీ ఛాంపియన్‌షిప్‌లో(ఓవర్ ఆల్ 1) మొత్తంగా ప్రథమ స్థానంలో నిలిచిందీ జోడీ. మనాలీలో 'ర్యాప్టార్స్ డ్రైవింగ్ స్కూల్'ని స్థాపించి పటిష్ఠమైన యువ రేసర్‌లని తయారుచేస్తూ రెవ్‌ల చప్పుడు ఆగకుండా చేస్తోందీ జోడి.

- శర్వాణి

ఈ నగరం బంగారమట

అబుధాబి నుండి దుబాయ్‌కు బయలుదేరాను. దూరం 140 కిలోమీటర్లు. కారు ప్రయాణం ఒకటిన్నరగంట. రోడ్డు కొంత దూరం ఆరు లైన్లు. ఆ పైన ఎనిమిది లైన్లు. దుబాయ్ దగ్గరయ్యేసరికి పన్నెండు లైన్లు. అబుధాబి సరిహద్దు 95 కిలోమీటర్ల వరకు దుబాయ్‌ది. అబుధాబి సరిహద్దు వరకు ఒక పక్క కొంత దూరం పది అడుగుల అందమైన ప్రహారీ గోడ. ఆ తర్వాత ఖర్జూరం చెట్లు. దుబాయ్ ఏరియాలో ఒక పక్క పూలమొక్కలు, క్రోటన్ మొక్కలు. రెండో పక్క దుబాయ్ వరకు మెట్రో రైలు లైను. మెట్రో రైలు స్తంభాలు కళాత్మకంగా ఉన్నాయి. వాటిని చూస్తే ఖర్చుకు వెనకాడినట్టు లేదు. ప్రతి స్తంభాన్ని అందంగా తీర్చిదిద్దాలనే అభిలాష అభినందనీయం. ఇరువైపుల ఎలక్ట్రిక్ స్తంభాలు. అడుగడుగునా కెమెరాలు.

– అడిగోపుల వెంకటరత్నమ్

దుబాయ్ జనాభా 25 లక్షలు. దుబాయ్‌లో 1930 వరకు ముత్యాల వ్యాపారం జరిగింది. అది దెబ్బతిన్న తర్వాత ప్రజలు పస్తులతో బతకలేక వలసలు ప్రారంభమయ్యాయి. 1969 నుండి ఆయిల్ వ్యాపారం సాగుతూ ఉంది. దుబాయ్ ఆర్థిక వ్యవస్థ అంతా ఆయిల్ వ్యాపారంతో పాటు పర్యాటక రంగం మీద ఆధారపడి ఉంది. వీటి వల్ల అపార సంపద పోగైంది. జీవ నదులు లేవు. వేడి ప్రాంతం. ముస్లింలతో పాటు క్రైస్తవులు, హిందువులు, సిక్కులు, బౌద్ధ మతస్తులున్నారు. ముస్లిం కాని ఇతర మతస్తులు వాళ్ల దేవాలయాలు కట్టుకోవచ్చు. దుబాయ్‌ని బంగారు నగరం అని కూడా అంటారు. మానవ హక్కుల ఉల్లంఘనలో దుబాయ్ ఉంది. బంగారం వ్యాపారం ఇక్కడ బాగా వృద్ధి చెందటంలో ఆర్థికంగా మరింత బలపడింది.పరిశుభ్రమైన వెడల్పయిన రోడ్లు, క్రమశిక్షణతో నిరంతరం సాగే వాహనాలు, నక్షత్రాలను సిగలో దాచుకున్నట్టు కనిపించే ఆకాశహార్మ్యాలు, రంగుల బల్బులు, వెండి రంగు దీప స్తంభాలు. వివిధ దేశాల ప్రజల కలయికలు.. అనేక భాషలు, రకరకాల అలంకారాలు.. ఖర్జూరం చెట్లు.. అప్పుడని పించింది ఇవన్నీ చూడ్డానికి రెండు కళ్లు చాలవని.



మాల్ మ్యూజియంలో 200 అడుగుల వెడల్పుతో నిర్మితమైన హాల్లో లక్ష సీతాకోక చిలుకల్ని చూడ్డం గొప్ప అనుభూతి. సీతాకోకచిలుకలు ప్రాణమున్నవి కావు. ప్లాస్టిక్ పేపర్లతో తయారైనవి. ఎత్తైన సీలింగుకు వేలాడదీశారు. జాగ్రత్తగా పరిశీలిస్తే గాని ప్లాస్టిక్ అని తెలియదు. అంత జీవమున్నట్లు చేశారు. సీతాకోక చిలుకలు హాలంతా ఎగురుతున్నట్లు అమర్చారు. ఇన్ని సంవత్సరాలుగా ఎగురుతున్నా ఒక్క సీతాకోక చిలుక నేలపై రాలలేదంటే ఆ నైపుణ్యానికి నమస్కరించవల్సిందే. ఎత్తిన మెడ చూసీచూసీనా మెడ నొప్పెదుతున్నా దించాలని పించలేదంటే ఆ దృశ్యం అపురూపం.

మేధస్సు కొత్తకొత్త ఆలోచనల్ని సృష్టిస్తుంది. అందులో మాల్ మ్యూజియంలో నిర్మిత జలపాతం దాదాపు 100 అడుగుల ఎత్తు 200 అడుగుల వెడల్పున్న ఈ జలపాతం నయనానందకరం. పై నుంచి మనుషులు జలపాతంతో పాటు కిందకు దూకుతున్నట్లు చిత్రించారు. చిన్న పిల్లల కేరింతలు మిన్నుముట్టుతాయి. ఎంతసేపు చూసినా కదలని పిల్లల్ని రెక్కపట్టి ముందుకు లాక్కుపోవటం ఇక్కడ కనిపిస్తుంది.

బుర్జ్ ఖలీఫా టవర్ ప్రపంచంలో ఎత్తైన మానవ నిర్మిత నిర్మాణం. దీని ఎత్తు 828 మీటర్లు. 30 కాంట్రాక్టు కంపెనీలు, 100 దేశాల నుంచి వచ్చిన కార్మికులు నిర్మించారు. లోపల రెండంచెల లిఫ్టులున్నాయి. వీటి ద్వారా పైవరకు వెళ్లవచ్చును. సాయంత్రం ఆరు గంటలకు దీన్ని రంగురంగుల లైట్లతో అలంకరిస్తారు. పక్కనే విశాలమైన సరస్సు ఏర్పాటు చేశారు. పడవలపై విహారం చేయవచ్చు. సాయంత్రం ఏడు గంటలకు మధురమైన సంగీత ప్రారంభమవుతుంది. సరస్సులో ఫౌంటెన్లు వివిధ భంగిమల్లో నాట్యం చేస్తాయి. నాట్యం శాస్త్రీయంగా ఉంటుంది. ఒకసారి కమలం రూపం కడతాయి. ఒకసారి ముద్దబంతి పువ్వులా కనువిందు చేస్తాయి. ఒకసారి ఆకాశచువ్వల్లా నింగికెగుస్తాయి. ఒకసారి నాగు పాముల్లా పడగ విప్పి కదులుతాయి. ఒకసారి చలికి వొణుకుతున్నట్లు చలిస్తాయి. మనిషికి ఆహ్లాదమై మనసు గాల్లో తేలుతున్నప్పుడు ఠక్కున సంగీతం ఫౌంటెన్లు ఆగిపోతాయి. ఇదంతా మూడు నిమిషాల ఆనందాల హరివిల్లు. ఫౌంటెన్లు నాట్యం చేస్తున్నప్పుడు లేచిన చల్లని బిందువులు గాల్లో తేలాడి చూపరుల శరీరాలపై అలవోకగా వాలుతాయి. ఆ స్పర్శకు మనసున మల్లెలూగుతాయి. మరల అరగంట తర్వాత మరో సంగీతంతో సరోవర రంగస్థలంపై ఫౌంటెన్లు ప్రదర్శన ప్రారంభమవుతుంది. శుక్ర, శని వారాలు సెలవులైనందున ప్రేక్షకుల రద్దీ చాల ఎక్కువ.





దుబాయ్ మ్యూజియం





దుబాయ్ మాల్ మ్యూజియంలో అడుగుపెట్టగానే మనసు ఆశ్చర్యంతో మునిగిపోతుంది. పాలరాతి ఫ్లోరింగ్‌పై ఎత్తైన కట్టడంపై ఉంచిన డైనోసార్ అస్థి పంజరం 2008లో అమెరికా దానా క్వారీ తవ్వకాల్లో బయటపడింది. ఇది ప్రపంచంలోనే అత్యంత పెద్దది. దుబాయ్ స్నేహ సంబంధాల్లో భాగంగా దీన్ని అమెరికా ఇక్కడకు పంపింది. ఇది 155 మిలియన్ సంవత్సరాల చరిత్ర గలది. అప్పుడు ఐదు ఏనుగుల బరువు కలిగిన ఈ డైనోసార్ శాఖాహారి. దీని పొడవైన మెడతో చెట్ల కొమ్మల్ని వంచి ఆకుల్ని తినేది. కరువు వల్ల చనిపోయి ఉండొచ్చని పరిశోధకుల భావన. అస్థిపంజరంలో ఏ ఒక్క ఎముక చెదిరిపోలేదు.

దంతాలు కూడా ఇప్పటికీ ఉన్నాయి. ఈ అస్థి పంజరం పొడవు 80 అడుగులు, వెడల్పు 25 అడుగులు. చనిపోయే సమయానికి యవ్వనంలో ఉన్నట్లు విశ్లేషకుల శోధనలో తేలింది. గత చరిత్ర తెలుసుకోవడానికి ఇదెంతో విజ్ఞానదాయకం. విద్యార్థులకు ఉపయోగం. దుబాయ్‌లో శుక్ర, శని సెలవు దినాలు. ఆదివారం సెలవు లేదు. క్రికెట్ టెస్ట్‌లు, ఫిలిం ఫెస్టివల్‌లు జరిగాయి. ప్రస్తుత రాజు మహమ్మద్ బిన్ రషీద్ ముఖ్తం. ఉద్యోగుల జీతాల్లో ట్యాక్స్ మినహాయింపులు లేవు. వస్తువుల కొనుగోలుపై ట్యాక్స్ ఉండదు.

భవిష్యత్తుకు సత్యవాక్కే ఆయువు..!



ఆ కొండ అంచుపై నిలబడినప్పుడు
మబ్బుల్ని వేళ్ళతో తాకాను
సముద్రం అంచులో నడుస్తున్నప్పుడు
అలలు నా ముని వేళ్ళను తాకాయి
ఎడారిలో ఒంటరిగా పయనించినప్పుడు
ఒంటెల వరుస నాకు లెక్కల పాఠాలు చెప్పాయి
జామచెట్టు ఎక్కి ఊపినప్పుడు రాలిన కాయకి,
చెట్టున వ్రేలాడుతున్న కాయకి తేడా తెలిసింది
ఇసుక రేణువు, అల, చెట్టు, ఆకు
అన్నీ నాకు గురువులే..
అతి పెద్దదానిలో అతి చిన్నదీ వుంది
అతి చిన్నదానితో అతి పెద్దదీ ఏర్పడుతోంది.
మనిషి నిశ్శబ్దంగా ఉన్న కాలమే గొప్పది
నిశ్శబ్దానికి సూర్య, చంద్రులను
ఆవహానం చేసుకొనేంత విస్తృతి ఉంది
ప్రతి దారిని ఎవరో మనిషే నిర్మించాడు
ఆ దారిన వెళ్తున బాటసారులకు
ఆ నిర్మాత స్పృహ లేదు
వారు కొత్తదారిని నిర్మించలేకపోతున్నారు
ఆశయానికి పట్టుదలే ప్రాణం
అంధత్వం ఆవరించాక పరిసరాలు శూన్యమౌతాయి
అవును! వారు పొగడగా పొగడగా
పాలకుడు బండరాయి అయ్యాడు
నేను చేస్తున్నది నిజమే అనుకొన్నాడు
ఊబిలో అతడు గొంతుదాక కూరుకుపోయాక
భజంత్రీలు మాయమయ్యారు ఇప్పుడు! అతని కేక
ఆకాశం కూడా వినడం మానేసింది
అతడు సుదూర తీరాలు నిశ్శబ్దంగానే నడిచాడు
అతడు నక్షత్రాలను చూశాడు
అవి పాలపుంతల కథలు చెప్పాయి
అతడు ఒకచోట చిన్న నీటిపాయను చూశాడు
అవి దాహార్తిగొన్న ప్రజల గురించి చెప్పాయి
అతడు ఒక బక్కచిక్కిన జింకను చూశాడు
ఎండిపోయిన బీళ్ళ గురించి అది మాట్లాడింది
అవన్నీ ఆలకించాక అతడు ఒక్క మాట అన్నాడు
'నీవు జీవిస్తూ పోరాడు.. పోరాడుతూ జీవించు..
యుద్ధం అంటే మనిషి గెలుపు కోసం చేసేదే
మృతుల కోసం మాట్లాడేవాడు
అబద్ధమే చెబుదుతున్నాడు
భయం నుంచి జ్ఞానం రాదు
జ్ఞానం ధైర్యం నుండే పుడుతుంది
ప్రతి తత్వవేత్తా యుద్ధమే చేశాడు
యుద్ధం చేసేవాళ్ళంతా తత్తవేత్తలు కారు
మాట్లాడుతూ యుద్ధం చేసేవాడు ఓడిపోతున్నాడు
వాడి తూటాకి మాటకి తేడా వచ్చింది
వాడు దేనికి గురిపెట్టాడో అది అక్కడ లేదు.
అందుకే! ఆ తూటా వాడికే ఎదురువచ్చి తగ్గిలింది
మరణాన్ని కీర్తించేవాడు అబద్ధికుడే
త్యాగాలను దొంగిలించాలనే కుట్ర వాడిది
ఎవడు చంపాడో వాణ్ణే న్యాయం అడుగుతున్నావాడు
అమాయకుడే! మైత్రి జీవధాతువు!
అది పరస్పర ఆధారితమౌతూనే మనల్ని నడిపిస్తోంది.
చిన్న పిట్ట కూతతో అవనికి మేల్కొలుపు
మనిషికి విలువ తెచ్చేదే కృతజ్ఞతే
కృతజ్ఞత లేని మనిషి
ఇసుక తిన్నెవలె తిరిగి ఏమీ ఇవ్వలేదు.
నిజాయితీ అంటే తిరిగి ఇవ్వటమే
ముందు పోరాటం నేర్చుకొందాం!
ఆ తరువాత విజయ పతాక ఎగురవేద్దాం!
జీవన సత్యాలన్నీ సమకాలీనంలో అవగతం కావు
భవిష్యత్తుకు సత్యవాక్కే ఆయువు..!

– డాక్టర్ కత్తి పద్మారావు

అ(భ్ర)మరావతి

వాగ్దానాల పరంపరతో ఎర
పుడమినిస్తే పుణ్యమని మొర
నమ్మించింది సర్కారే ఇలా..
సేకరణ స్థానే సమీకరణ సాగిందలా..!
అన్నదాతలే ఆదుకున్నారు..
భూమాతనే వదులుకున్నారు..
కోటలు దాటే మాటలు అప్పుడు
కడుపు నింపని కబుర్లు ఇప్పుడు ..!
కష్టజీవులకు పనులు కొండెక్కె
ఊరించిన ఉద్యోగాలు హుళక్కే
ధర్మం తీసుకుని బిచ్చం వేస్తున్న ప్లాట్లు
సంతృప్తి లేదంటే షరతులతో పాట్లు..!
రాజధాని రియల్ వ్యాపారమిది
భూములమ్మడమే పరమావధి
సింగపూరు కోసమే సిస్సు ఛాలెంజీ
న్యాయపాలిక ముందు తుస్సుమందిది..!
ప్రశ్నిస్తే అభివృద్ధి నిరోధకమట
పోరాడితే ఉగ్రవాదమేనట
ఎవరేమన్నా వ్యతిరేకతేనట
ఇక్కడున్నది ప్రజాస్వామ్యమేనట..!

శంకుస్థాపనలపై శంకుస్థాపనలట
వాస్తు కోసం సర్కారీ కమిటీలట
మనది. . సెక్యులర్ రాజ్యమేనట
ఔనా.. అని ఎవరూ నవ్విపోరట..!

– కె.ఎ. దొర
8008723737



ఫోన్ కన్నా ముఖ్యం



▸ స్వాతంత్ర్యం కన్నా పారిశుధ్యం ముఖ్యమని మహాత్మా గాంధీ ఎప్పుడో చెప్పారు.

▸ ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మంది ప్రజలకు మరుగుదొడ్డి సౌకర్యం లేదు. ప్రత్యేకించి దక్షిణ ఆసియా, ఉప సహారా ఆఫ్రికాలో ఇలా ఉందన్నారు. చిత్రం ఏమిటంటే టాయిలెట్స్ కంటే మొబైల్ ఫోన్స్ ఎక్కువ మందికి ఉన్నాయి.

▸ మరుగుదొడ్డి అవసరాన్ని గుర్తించే ఏటా నవంబర్ 19వ తేదీని ప్రపంచ టాయ్‌లెట్ దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.

▸ పారిశుధ్యం సరిగా లేనందున ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది రోగాల బారిన పడతారు. ముఖ్యంగా పిల్లలపై రోగాల తీవ్రత ఎక్కువ.

▸ ప్రపంచవ్యాప్తంగా 5 ఏళ్ల లోపు పిల్లలు ఏటా 15 లక్షల మంది పారిశుధ్య లోపం వల్ల అతిసార వ్యాధి సోకి మరణిస్తున్నారు.

▸ సంపన్న దేశాలలో 30 శాతం కాలువల ద్వారానే మల విసర్జన బయటకు వెళ్తుంది.

▸ ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది టాయిలెట్స్‌కు ఆరుబయటకే వెళ్తున్నారు.

▸ మరుగుదొడ్ల వాడకం గత రెండు శతాబ్దాల మానవ జీవనంలో సుమారు 20 ఏళ్ల ఆయుఃప్రమాణాల్ని పెంచాయి.

▸ ప్రపంచవ్యాప్తంగా 40 శాతం జనాభాకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన మరుగుదొడ్లు లేవు.

▸ 90 శాతం డయేరియా కేసులు ఆహారం, తాగునీరు కలుషితమైనందున పెరుగుతున్నాయి. వీటికి తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లయితే మరణాలని 50 శాతం నివారించవచ్చు.

▸ ఆరుబయట మల విసర్జన చేసే ప్రాంతాలకు చెందినవారు రోజుకు 10 గ్రాముల వరకు మానవ వ్యర్థాలను ఆహారం, నీరు ద్వారా తెలీకుండానే స్వీకరించే అవకాశం ఉందని తేలింది.

▸ చేతుల్ని శుభ్రంగా కడుక్కోకుండా టాయ్‌లెట్ నుంచి వచ్చి మొబైల్ ఫోన్ కీలను, కంప్యూటర్ కీబోర్డులను వాడటం వల్ల వాటిపై ప్రాణాంతక బ్యాక్టీరియా అత్యధికంగా పోగు పడుతోందని గుర్తించారు. ఇవే ఫోన్లను ఇళ్లలోని చిన్నారులకు ఇవ్వడం ద్వారా వారు వ్యాధుల బారిన పడుతున్నారు.

▸ 20వ శతాబ్దం ప్రారంభంలో టాయిలెట్స్‌ను అవుట్ హౌస్ అనేవారు. మనిషి సైజులో చెక్క బాక్స్ తయారుచేయించి అందులో టాయిలెట్‌ను అమర్చేవారు.

▸ ఒక్కగ్రాము మానవ వ్యర్థాల్లో కోటి వైరస్ క్రిములు, పది లక్షల బ్యాక్టీరియా, 1000 పరాన్నజీవులు, 100 నులి పురుగుల గుడ్లు ఉంటాయట.

▸ పబ్లిక్ రెస్ట్‌రూమ్ తలుపు హాండిల్‌పై చదరపు అంగుళానికి 40 వేల సూక్ష్మక్రిములు అభివృద్ధి చెందుతాయట.

▸ మనిషి జీవిత కాలంలో 3 ఏళ్ల పాటు టాయ్‌లెట్‌లోనే గడుపుతాడు.

▸ అందరూ కేవలం చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా ఏటా 35 లక్షల మంది పిల్లల ప్రాణాల్ని కాపాడొచ్చు.

▸ దేశంలో 53 శాతం మంది ఆరుబయటకే వెళతారు. పారిశుధ్య లోపం వల్ల ఏటా ఆరోగ్యానికి లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోంది.

▸ క్వీన్ ఎలిజబెత్ సంస్థానంలోని సర్ జాన్ హరింగ్‌టన్ 1596లో ఆధునిక ఫ్లష్ టాయిలెట్ బ్యాక్‌ను కనిపెట్టాడు. 1775లో ఆ మోడల్‌ను కొంత మార్చాడు.

▸ మొబైల్ ఫోన్‌లపై టాయిలెట్ సీట్‌పై కన్నా ఎక్కువ వైరస్ వుంటాయి.

▸ ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది మొబైల్ ఫోన్లను టాయిలెట్స్‌లోనూ ఉపయోగిస్తున్నారు. ఇది చాలా చెడ్డ అలవాటు.

▸ యూనివర్సిటీ అరిజోనా మైక్రోబయోలజిస్ట్ చార్లెస్ జర్బా చెప్పిన ప్రకారం టాయిలెట్ సీట్ కూర్చొనే ముందు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. బాత్‌రూమ్ డోర్‌ను టాయిలెట్‌కు వెళ్లేటప్పుడు మినహా మిగతా సమయాలలో తీసి ఉంచమని సూచించారు. లేకుంటే తడిగా ఉండి అనేక బాక్టీరియాలు వృద్ధి చెంది రోగాలు సోకడంతో బాటు విష పురుగులు కూడా వ్యాపిస్తాయని తెలిపారు.

▸ ఇప్పుడొచ్చిన సాంకేతిక మార్పు చేర్పుల వల్ల ఫ్లష్ చేయడానికి నీటి వాడకం తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఒక్కో ఫ్లష్‌కు 6 లీటర్ల నీరు ఖర్చవుతోంది. అదే 1992కు ముందు 16 లీటర్ల నీటి వాడకముండేదట.-

▸ న్యూ ఢిల్లీలోని సులభ్ ఇంటర్నేషనల్ మ్యూజియంలో వివిధ రకాల మరుగుదొడ్లు, వస్తువులు, వివరాల్ని ప్రదర్శిస్తారు.

ఫ్లెక్సీలు

కథ

- ఆత్మకూరు కామయ్య
078931 29272

"మా లీడర్‌కి జన్మదిన శుభాకాంక్షలు!"

ఫ్లెక్సీలో పెద్ద.. పెద్ద..బీద అక్షరాలు! అక్షరాలపైన 'మా లీడరు' ఫోటో!

"ఈయన 'మాలీడరు'? లీడరు! సొంతూళ్ళో సర్పంచ్‌గా గెలవలేని యీయన 'మా లీడరు'! ఫుల్ సైజ్ స్టైలి ఫోటో! చెవి దగ్గర సెల్‌ఫోను! ఆయన కొక్కడికే వున్నట్లు!

సికాకుళం అప్పలమ్మ గ్గూడా వుంది స్మార్ట్ ఫోను. అప్పలమ్మది దినకూలికి మిద్దెలపైకి కంకర మోసేపని. "మా లీడరు" ది ప్రియమైన ప్రజల దగ్గర దొరికిన కాడికి డబ్బులు దోచుకొని, మిద్దెక్కి ఏసీ రూములో ఫారిన్ విస్కీ దొబ్బితాగే పని.

అవురవుర! అశ్శరభ! శరభ! ఎక్కడికి పోతున్నదీ ప్రపంచం!

పకీరయ్య పకపకా నవ్వాడు నడిరోడ్డులో నిలబడి ఆ ఫ్లెక్సీని చూచి!

"ఈయన 'మా లీడరా?!లీడరంటే ఎవరు?

గాంధీ, నెహ్రూ, ఎన్టీయార్... ఆయన కన్నా ముందు ఎమ్జీయార్!... ఆయన కన్నా ముందు అన్నాదురై!

అమెరికాలో అబ్రహాం లింకన్...రష్యాలో లెనిన్!.. చైనాలో మావో! మావూళ్ళో పుచ్చలపల్లి సుందరయ్య. నేను హైస్కూల్లో చదివేటప్పుడు మా సోషలయ్యోరు చెప్పాడు లీడర్ల గురించి. వాళ్ళకెవ్వరికీ ఫ్లెక్సీలు లేవు, ఆ రోజుల్లో! వుండినా, వాళ్ళు ఫ్లెక్సీలలోకి ఎక్కుండేవోళ్ళు గాదు. ఎంత సిగ్గు! సిగ్గు! సిగ్గు లేని పనులు! అనుకుంటూ పకీరయ్య ఇంటికి చేరాడు ఇంటర్నెట్ షాపు నుంచి.

ఆ రోజు ఇంటర్మీడియట్ రిజల్ట్సొచ్చాయి. నెట్లో చూశాడు పకీరయ్య. కూతురికి 980 మార్కులొచ్చాయని తెలిసింది. స్వీటు కొని తెచ్చాడు. తీరా యింటికొచ్చి చూస్తే నమ్రత బెడ్రూంలో ముసుగుదన్ని పడుకోనుంది. తన ముద్దుల కూతురు. ఆ అమ్మాయి పూర్తి పేరు వినమ్రత.

ఒక్కొక్కసారి 'వినమ్ర' అని పిలుస్తుంటారు.

ఒక్కొక్కసారి 'నమ్రత' అని పిలుస్తుంటారు.

"ఏమయింది వినమ్రమ్మకి?''

అడిగాడు భార్యని.

"యిష్...యిష్...! ఏడస్తా వుంది" నిశ్శబ్దంగా వుండమని మొగుడికి సంకేతమిస్తూ తాను మాత్రం శబ్దం చేసేసింది పకీరయ్య భార్య సుందరమ్మ.

"ఏమయిందో చెప్పమంటే..యిస్సు! బుస్సు... మంటావేందే! అరిచాడు ఆందోళనగా పకీరయ్య.

వినమ్రత కప్పుకున్న ముసుగును తీసి పారేసింది, పైనబడ్డ పసిరిక పామును తీసి అవతల పారేసినట్టు. "డాడీ! అంటూ పక్కమీది నించి దూకింది. గుక్క తిప్పుకోకుండా ఏడవసాగింది. తెగిపోయిన డ్యాం ప్రవాహం వలె!

తండ్రి కాళ్ళకు చుట్టుకొనింది చిన్నప్పటి వలె." ఊరుకో! నమ్రా! నా బుజ్జివి గదా!! నా తల్లివి గదా! ఊరుకోరా! ఏడవకురా!"

ఓదార్చలేకపోతున్నాడు పకీరయ్య. నిల్చున్న చోటనే నిలబడిపోయాడు వసారా 'నిట్రాడు' వలె.

ఒక గంట సమయం! రెండో గంట కూడా పూర్తయ్యింది. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి నేలమీదనే నిద్రపోయింది. నమ్రత.

ఆ తర్వాత సుందరమ్మ చెప్పింది.

"రిజల్ట్సొచ్చాక వాళ్ళ కాలేజీ నుంచి ఎవరో ఫోన్ చేశారు. 990 మార్కులొచ్చుంటే ఫ్లెక్సీకెక్కుండేదంట నమ్రత ఫోటో! ఇప్పుడు కుదరదంట! అదీ సంగతి. అప్పట్నించీ ఏడుస్తానే వుంది."

అదే రోజు! సమయం సాయంత్రం ఆరు గంటలు. వినమ్రత సెల్‌ను తీసుకొని పార్కులో వున్నాడు పకీరయ్య.

"ఏ దేశమేగినా.....ఎందుకాలిడినా!" వినమ్రత ఫోన్లో రింగ్‌టోన్.

"హలో!" కాల్ రిసీవ్ చేసుకున్నాడు.

"హెలో! వినమ్ర గారు లేరాండీ!" అవతల్నించి.

"ఉన్నారు. నిద్రపోతున్నారు. చెప్పండి."

"నేను మళ్ళీ కాల్ చేస్తాను."

"హలో! ఫోన్ కట్ చెయ్యొద్దు? మధ్యాహ్నం వినమ్రకి ఫోన్ చేసింది నువ్వే గదా? ఆ అమ్మాయి ఫోటో ఫ్లెక్సీలో వెయ్యమని ఎవరడిగారు మిమ్మల్ని? కాలేజీలో ఏం ఉద్యోగం నీది? " ఫోన్ కట్ అయింది.

"హలో...హలో..హలో.." నో రెస్పాన్స్!

"కాల్ కట్ చేశాడు. ఇడియట్! పోతాను కాలేజీకే పోతాను.... కరస్పాండెంట్‌తోనే చెప్తాను. వినమ్ర ఫోటో ఫ్లెక్సీలో వెయ్యొద్దని!"

పకీరయ్య 'అబ్రకదబ్ర' యింటర్నేషనల్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ మరియు జూనియర్ కాలేజి' కాంపౌండులో ప్రవేశించాడు!..లోపల....

"ప్లీజ్! కరస్పాండెంట్ గారున్నారా?".....పకీరయ్య.

"లేరు." కాలేజ్ వర్కర్.

"లేరా! పోయారా ఎప్పుడు? టీవీలో న్యూస్ రాలేదే? కర్మంత్రాలెప్పుడు. రోడ్డు మీదున్న ఫ్లెక్సీలో రాసున్నారా? కసితో పకీరయ్య.

"పాపం! పిచ్చోడు!" పైకే!

"పిచ్చోడినేరా! నా బిడ్డ యింగ్లీషు మీడియం చదువుకి.... ఇంటర్ కూడా పాస్ కాని...

మీ స్కూలు కరస్పాండెంట్‌కి పది లక్షలిచ్చాను. ఇంటర్మీమీడియట్ కి నాలుగు లక్షలిచ్చాను!..

ఎర్రసూర్యుని వలె చుర్రున చూస్తూ ఆ మాటలు మాట్లాడాడు పకీరయ్య. "అయితే ఏమిటి? ఆ డబ్బు యిప్పుడు తిరిగిచ్చెయ్యమంటావా? ఇంతకీ నువ్వెవరు? నమ్రత ఫాదర్‌వా? ప్రశ్నించాడు ఆ వర్కరు.

"నేను ఫాదర్ని కానురా! తండ్రిని! 'ఫాదరైతే మిమ్మల్ని క్షమిస్తాననుకుంటున్నారేమో! మిమ్మల్నెవరడిగారు మా అమ్మాయి ఫోటోను ఫ్లెక్సీలో కెక్కించమని?" కసుకుకున్నాడు పకీరయ్య.

"ఆఫ్టరాల్ ! నేనొక ఆర్టీసీ బస్ కండక్టర్ని. మా తాత యిచ్చిన పొలం అమ్మి, ఆ డబ్బు నా కూతురి చదువు కోసం పెట్టాను! ఆ అమ్మాయి ఫోటోను మీ ఫ్లెక్సీలో పెట్టుకోడానికి కాదు!" మళ్ళీ రెచ్చిపోయాడు పకీరయ్య.

"సీ...మిస్టర్!"

"సీ-కాదు-బే ఆఫ్ బెంగాల్ కాదు! వినండయ్యా! అను..నాతో మాట్లాడాలంటే!?" స్కూలు వర్కర్నీ చొక్కా కాలరు పట్టుకున్నాడు పకీరయ్య.

పదిమంది రౌడీలు వొచ్చారు. పకీరయ్యను కాళ్ళతో, చేతుల్తో తన్నుకుంటూ గేటు బయటి రోడ్డు మీద పడేశారు.

పకీరయ్య అబ్రకదబ్ర కాలేజి గేటు బయట రోడ్డు మీద పడున్నాడు. కార్లు పక్కకి తొలగిపోతున్నాయి. ఆటోలు గూడా! టూ వీలర్సున్నూ అటుపై ... ఆసుపత్రిలో పకీరయ్య యింజక్షన్ మత్తులో.

పకీరయ్యకి మెలకువొచ్చింది. మళ్ళీ నిద్రొచ్చింది.... నిద్రలో..

ఎదురుగా పెద్ద ఫ్లెక్సీ. రెండేళ్ళ కిందటిది. ఆ యేడు నమ్రతకి టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఆరొందలకి ఐదొందలా తొంభై మార్కులు.

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్! వినమ్రత-వినమ్ర-నమ్రత... టీవీల్లో ఇంటర్వ్యూలు!

అబ్రకదబ్ర ఇంగ్లీషు మీడియం స్కూలు దగ్గర రోడ్డు పక్కన ఆ పెద్ద ఫ్లెక్సీ. ఫ్లెక్సీలో స్కూలు కరస్పాండెంట్ పెద్ద మొహం. ఆ మొహం బ్రాందీ, విస్కీలు తాగి డయాలసిస్ చేసుకునే వోడి మొహం వలె వుంది. కళ్ళ కింద నీళ్ళతిత్తులు ఉబ్బి రోడ్డు మీదకి పొడుచుకొచ్చుండాయి.

ఆ ఫ్లెక్సీలో నా బిడ్డ నమ్రత ఫోటో!

"సినిమాల్లో... ఇలియానా వలె...కాజల్ అగర్వాల్ వలె...తమన్నా వలె...కత్రినా కైఫ్ వల..! అబ్బ పిల్ల ఎంత సెక్సీగా వుందిరా ఫ్లెక్సీలో!"

కామెంట్ !వినబడేసరికి "నమ్రత సినిమా స్టార్ కాదురా!" అరిచాడు పకీరయ్య ఆసుపత్రిలో అయోమయంగా.

ఆసుపత్రి నించి డిశ్చార్జ్! ఇంట్లో పకీరయ్య పక్కన సుందరమ్మ. దూరంగా నమ్రత...

"ఏ దేశమేగినా...ఎందుకాలిడినా.."

నమ్రత ఫోన్ తెచ్చింది. నాన్న కిచ్చింది.

రిసీవింగ్.."హలో..ఎస్! నమ్రత తండ్రిని!"

"హెలో..సర్! కరస్పాండెంట్ ఒప్పుకున్నారు."

"దేనికి?"

"నమ్రత ఫోటో ఫ్లెక్సీలో కెక్కించడానికి! ఇంటర్లో 990 మార్కులొస్తేనే ఫ్లెక్సీలో చోటు!

జస్ట్! బ్యాడ్ లక్ ! "నమ్రతకి 980 మార్కులేవొచ్చాయి. అయినా అడ్జస్టు చేసుకుంటున్నారు కరస్పాండెంట్! నమ్రత మా కాలేజి బ్రాండ్ అంబాసిడర్!

సాయంకాలమొస్తాం! నమ్రత ఫోటో తీస్కుంటాం!.. వాకే!"..వాగేశాడు అవతలివాడు.

"అసలొద్దన్నాం గదా! సరే నమ్రత తృప్తి కోసం! జస్ట్ పాస్‌పోర్ట్! ఆల్రెడీ మీ దగ్గరే వుంది గదా?"

"నో సార్! సారీ! నమ్రత మంచి ఫోజివ్వాలి! ఇంటి కొచ్చి ఫోటో తీస్కుంటాం! వాకే.."



"షటప్..యూ..రాస్కెల్ !" ఫోన్ కట్ చేసేశాడు పకీరయ్య.

● ● ●

"ఫ్లెక్సీవొద్దులే నాన్నా! నాన్నా! చెప్పింది నమ్రత.

"నా బంగారు తల్లి! నన్ను అర్థం చేసుకున్నది. నమ్రా! ఫ్లెక్సీలో నిన్ను ఎగ్జిబిట్ చేసి ఆ కరస్పాండెంట్ పిల్లల తల్లిదండ్రుల్ని మళ్ళీ కరిచేస్తాడు ఈ సంవత్సరం గూడా! నీకు 980 మార్కులొచ్చాయి గదా! ఆ మార్కుల్లో డైరెక్టుగా నీకు మెడిసిన్‌లో సీటిచ్చేస్తారా? యివ్వరు గదా! ఎమ్సెట్టు! నీట్! క్వాలిఫై కావాల్సిందే గదా! ర్యాంకు రావల్సిందే గదా!

నీకు ఫ్లెక్సీ పిచ్చి వొదిలిపోయింది. చక్కగా చదువుకో! చరిత్ర, సామాజిక శాస్త్రాల్లో పీ.జీ డిగ్రీలు తీసుకో! పీ.హెచ్.డీ చెయ్యి!

భావి పౌరులకు సామాజిక స్పృహ కలగవచ్చు! పాఠాలు చెప్పకు!.. చర్చించు విద్యార్థులతో వారిని చర్చించుకోనివ్వు. వాళ్ళ సృజనకు వికసింపజెయ్యి! నువ్వు మనిషిగా జీవించు. ఇతరులను జీవింపజెయ్యి! మన దేశంలోని యువశక్తి... వనరులు.. మేధస్సు.. అన్నీ మన దేశానికి ఉపయోగపడాలి. చెప్పడం ఆపి కన్నీళ్ళు పెట్టుకున్నాడు పకీరయ్య.

నమ్రత నాన్న గుండెల మీద వాలిపోయింది. ప్రకృతి పరవశించింది. ఆప్యాయత పరిమళించింది.

గుడికి వెళ్ళారు.

గుడి లోపలకి వెళ్ళే 'ఆర్చి' ఎదురుగా రోడ్డు పక్కన.. భక్తులు ఉచ్చలు పోసుకునే చోట్లలో! ఫ్లెక్సీలు! గుడి నుండి వూళ్ళో దాకా! ఎన్నో! ఎన్నెన్నో! అన్నిటినీ చూచాడు పకీరయ్య.

"దుష్టులను దునుమాడే మా నేతకు నూతన సంవత్సర శుభాకాంక్షలు!" పైన పేషెంట్ నేత ఫోటో ! అన్ని ఫ్లెక్సీల్లో ఆ వాడే!

"దుష్టులెవరు? ఓహో దుష్టులా! పాపం తెలుగు!"

పకీరయ్య భక్తి పతనమైంది. మొక్కుబడిగా మొక్కుబడి తీర్చుకొని వొచ్చేశారు. ఫ్లెక్సీలో 'భాషకు' గతికి విచారించాడు పకీరయ్య. "ఎంత దుర్గతి అయ్యయ్యో!" అని బాధపడ్డాడు.

● ● ●

ఏప్రిల్ నెలాఖరులోనే ఎండలు మండేస్తోన్నాయి. సూర్య థరడ్ డిగ్రీ 44,45,4647,48 అంటూ టీవీల్లో భయపెట్టేస్తున్నారు, కాస్తున్న ఎండల కంటే!

పకీరయ్య డ్యూటీ దిగాడు. రోడ్డున పడి నడుస్తున్నాడు. నాలుగు రోడ్ల కూడలి.

అంతెత్తున పెద్ద ఫ్లెక్సీ! తలపైకెత్తాడు.

ఆకాశంలో అంబేద్కర్! అక్కడే చీకటి మబ్బులు.

'పెటిల్మ'ని ఉరిమింది!' ధగధగమని మెరిసింది.!

వడగళ్ళు! ఒక మంచురాయిపై నించి పడింది పకీరయ్య నెత్తిన!

రోడ్డు వారన పడిపోయాడు. పై నుంచి ఫ్లెక్సీలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఫోటో వానకి తడిసి కన్నీళ్ళు కారుస్తోంది.

"అది ఏప్రిల్ పద్నాలుగున పెట్టిన ఫ్లెక్సీ అయ్యుంటుంది..?

"అయ్యో! అంత గొప్ప మేధావివే"

భవిష్యత్తులో ఫ్లెక్సీలు రాబోతాయి!

అని ఊహించలేకపోయ్యావా? వెధవలందర్నీ ఎక్కించే అలాంటి ఫ్లెక్సీలోని నన్నెక్కిచ్చొద్దని భారత రాజ్యాంగంలో రాయలేకపోయ్యావా? వీలు కాకపోతే వీలునామాలో లిఖించలేకపోయావా?" పకీరయ్య పలవరిస్తున్నాడు.

ఖరీదైన టూ వీలర్‌లో భావి ప్రజానాయకుడు. తాగిన కైపుతో 'జనం ప్రాణాలతో నాకు సంబంధం లేదంటున్నట్లు యమ స్పీడుతో వస్తున్నాడు పకీరయ్య ప్రాణాల కోసం-

పకీరయ్య రోడ్డువారకి దొర్లాడు. పకీరయ్యల్లాంటి బంగారయ్యలు-సింగారయ్యలు రోడ్ల పక్కన విలసిల్లుతున్న ఫ్లెక్సీల 'అసహ్యాలను సమూల విధ్వంసం చేయాల్సి వుంది భవిష్యత్తులో.

అందుకే పకీరయ్య భావి ప్రజానాయకుడి టూ వీలర్ వేగాన్నించి తప్పించుకున్నాడు ప్రాణాలతో !

మరపురాని 'సొంత'రావూరు

విదేశాల్లో ఉన్నా.. ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నా.. పరాయి ప్రాంతాల్లో నివాసమున్నా.. కన్నతల్లినీ, సొంత ఊరునీ స్ఫురణకు తెచ్చుకోనివారు ఉండరనే చెప్పాలి. తాము ఆ గ్రామంలో గడిపిన రోజులు, కష్టపడి పెంచిన తల్లిదండ్రులు, చదువులు చెప్పిన గురువులు, ప్రేమాభిమానాలు పంచే పల్లె ప్రజలు, వరసలు కలిపి ఆప్యాయంగా పిలిచే బంధువులు, చిన్నప్పటి ఊసులు చెప్పే మిత్రులు ఇలా.. తమ ఊరు పేరెత్తితే చాలు అంతులేని పరవశం చెందని వారెవరుంటారు? గ్రామానికి దూరంగా ఉంటున్నవారు ఆ గ్రామానికి చెందిన వారెవరైనా తారసపడినప్పుడు గ్రామ విశేషాలు, అక్కడివారి యోగక్షేమాల గురించి తెలుసుకోడానికి ఓ గంటో.. అర గంటో కేటాయిస్తూ ఉంటారు. అయితే 'మా ఊరు సంతరావూరు' రచయిత తోటకూర వెంకట నారాయణ మాత్రం తమ గ్రామంలోని అప్పటి, ఇప్పటి అన్ని విషయాలు అందరికి తెలియజేయడం కోసం లెక్కలేనన్ని రోజులే కేటాయించడం అభినందించదగిన విషయం. ఒకప్పుడు, వర్తక, వాణిజ్య కేంద్రంగా భాసిల్లడంతో పాటు, గాంధీజీ అడుగిడిన తమ స్వగ్రామ చరిత్ర ఎలా రాయాలనేది చరిత్ర అధ్యాపకునిగా, ప్రిన్సిపల్‌గా పని చేయడం రచయితకు బాగా ఉపయోగపడింది. ఎడ్లపాడు, పాలపర్రు, కోలలపూడి, భట్లపెనుమర్రు, తదితర గ్రామాల చరిత్రలను చదివి రచయిత ప్రేరణ పొంది తమ స్వగ్రామం సంతరావూరు రాసేందుకు



రచన : మా ఊరు సంతరావూరు
రచయిత : తోటకూర వెంకట నారాయణ
పేజీలు : 200, **ధర** : 150/-
ప్రతులకు : తోటకూర రామసీత
2-సి గీతా రెసిడెన్సీ, ఎన్.ఆర్.టి.సెంటర్
చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.
మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

కంకణం కట్టుకున్నారు. ప్రతి ఊరికి ఆ పేరు రావడానికి ఏదో ఒక కారణం ఉంటుంది. రావి చెట్టున్న ఊరు రావూరైందనీ, సంతలు జరగడం వల్ల సంతరావూరైందనీ.. శాతవాహనుల కాలం నుంచి వాసిరెడ్డి వారి వరకు తాను పుట్టి పెరిగిన తమ 'సొంత'రావూరులో జరిగిన చారిత్రక ఘట్టాలను ఆయన సంకలనం చేశారు. గ్రామ చరిత్రను గుర్తు చేసే దేవాలయాలు, చెరువులు, కాలువలు, కుంటలు, పలురకాల పంటలు, పశుపోషణ, ప్రకృతి బీభత్సాలు, వృత్తులు, వ్యాపారాలు, రహదారులు, సంతలు, గ్రామ పెద్దలు, జాతి నేతల విగ్రహాలు, జలరవాణా, కులమతాలు, విద్యావ్యాప్తికి జరిగిన కృషి, సినిమా, నాటక ప్రదర్శనలు, పండుగలు, పిండివంటలు, కోడిపందేలు, జాతర్లు, కొలుపులు, శిలా శాసనాలు ఇలా వేటినీ వదలకుండా వాటి గురించి వివరించారు. ఈ ఊరికి చెందినవారు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేయడమే కాదు దేశ, విదేశాల్లో స్థిరపడినవారి వివరాలు ఇందులో పొందుపరిచారు. సంతరావూరు నేడు అనామకంగా, అనాథలా పడిఉందని, ఎంత మంది నాయకులున్నా, వారెంత చిత్తశుద్ధితో పనిచేసినా, గ్రామం అభివృద్ధి చెందాల్సినంతగా చెందలేదనీ, తాత్కాలికమైన ఆవేశకావేశాలకు లోనుకావడం, గ్రూపు రాజకీయాలపై శ్రద్ధ చూపడం తదితరాలు కారణాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆదర్శవంతమైన, అందమైన గ్రామం కోసం శాయశక్తులా ప్రయత్నించాలని వెంకట నారాయణ సూచించారు. ఇందులోని ఎన్నో విషయాలను తమ సొంత ఊరితో సరిపోల్చుకుంటే సరిపోతాయని వేరే వారికి సైతం అనిపించక తప్పదు. ఆర్.కె.నారాయణ్ మాల్‌గుడీస్ కథల మాదిరిగా సంతరావూరు కథలు కూడా తీసిపోని విధంగానే ఉన్నాయి. దీన్ని చదివిన వారికి 'మా ఊరు చరిత్ర కూడా రాస్తే బాగుంటుంది' అనే కోరికను కలిగించారు రచయిత.

\- టి.డి.ప్రసాద్

మధ్యతరగతి బతుకు చిత్రాల 'గాలివాన'

కథాసాహిత్యాన్ని ఎక్కువగా చదివేవారిని దృష్టిలో పెట్టుకుని రాసిన కథల సంపుటి 'గాలివాన'. రచయిత గన్నవరపు నరసింహమూర్తి. ఈ సంపుటిలోని కథల్లో ఎక్కువ శాతం ఆయా సంఘటనలను, కొన్ని దృశ్యాలను, అక్కడక్కడా రచయిత అనుభవాలను కథనాలుగా మలిచినట్లు స్పష్టమౌతుంది. అందువల్ల కొన్ని కథల్లో శైలి అంత ఆసక్తికరంగా ఉండదు. మొత్తం పాతిక కథలున్న ఈ సంపుటికి శీర్షికగా నిర్ణయించిన 'గాలివాన' కథ ఇందులో ఎనిమిదోది. మొదటి కథ 'స్వేచ్ఛ' ఈ కథలో భార్యాభర్తల అనుబంధాన్ని వివరించారు. రెండో కథ 'పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం' పర్యావరణంలో ప్రతికూలతల వలన పిచ్చుకల జీవనంపై ఎలాంటి ప్రభావం పడిందో వివరిస్తుంది. రచయిత వివిధ పత్రికల్లో వచ్చిన

గాలివాన
గన్నవరపు నరసింహమూర్తి
కథలు
పేజీలు: 192, **ధర:** రూ.150/-
ప్రతులకు :చినుకు
ప్రచురణలు
గాంధీ నగర్,
విజయవాడ-520 003

వార్తా కథనాల ప్రేరణతో ఈ కథ రాసినట్లు కన్పిస్తోంది. దయనీయ స్థితిలో ఉన్న నాటక రంగం, నటననే నమ్ముకున్న కళాకారుల దైన్యాన్ని 'చరమాంకం' కథలో చిత్రించారు. పెళ్లికి ముందున్న ఆకాంక్షలు పెళ్లి జరిగిన తర్వాత తీరకపోతే ఎలా ఉంటుందో 'వాలుజడ' కథలో చదవొచ్చు. భగ్నప్రేమికులకు జీవితంలో ఎదురైన అనుభవాల కలబోతే 'చేదు నిజం' కథ. ఇలా ఈ సంపుటిలోని అన్ని కథలూ చదివిస్తాయి. అయితే రచయిత కథావస్తువు పట్ల చూపిన శ్రద్ధను కథనాన్ని నడిపించే విషయంలో చూపించలేకపోవడం చదువరులకు కొంత అసంతృప్తిని కలిగిస్తుంది. ఈ సంపుటిలోని కొన్ని కథలలో అంతగా కొత్తదనం కన్పించదు. అయినా సరే కథాకథనంలో రచయిత మరికొంత శ్రద్ధ తీసుకుంటే మంచి కథలను పాఠకులకు అందించగలరనడంలో ఎలాంటి సందేహం లేదు. మధ్యతరగతి జీవితాలను మరింత లోతుగా గమనించాలంటే ఈ కథలు అందుకు తోడ్పడతాయి.

\- బెందాళం క్రిష్ణారావు

పేద విద్యార్థులకి బట్టలు, పుస్తకాలతోపాటు వారికి పాదరక్షలు కూడా అవసరమనే విషయాన్ని ఎక్కువ మంది పట్టించుకోరు. పాదరక్షలు ధరించని కారణంగా ప్రపంచవ్యాప్తంగా 150 కోట్ల మంది చిన్నారులు ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రస్తుతం వారి సంఖ్య మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందన్న నిజాల్ని కొన్ని సర్వేలు వెల్లడించాయి. ఇలాంటి ప్రమాదాల నుంచి చిన్నారులని కాపాడేందుకు పాత చెప్పులని రీసైకిల్ పద్ధతుల ద్వారా పునరుద్ధరించి బడిపిల్లలకు ఉచితంగా అందించే ప్రయత్నం చేస్తోంది ముంబయికి చెందిన గ్రీన్ సోల్ సంస్థ.

పాద రక్షకులు

మనం తొడుక్కునే జోళ్లు తెగిపోతే డస్ట్‌బిన్‌లో లేదా చెట్ల కింద, ఫుట్‌పాత్‌ల వద్దా వాటిని వదిలేస్తుంటాం. పనికిరావవని అలా మనం పడేస్తున్న చెప్పులు ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 350 మిలియన్ జతలుగా పేరుకుపోయి కాలుష్య కారకాలవుతున్నాయి. పర్యావరణానికి హాని కలగకుండా పాత చెప్పుల ద్వారా పాఠశాల విద్యార్థులకు ఒక కొత్త ప్రయోజనాన్ని కలిగించేందుకు పనిచేస్తోంది ముంబయికి చెందిన గ్రీన్ సోల్ సంస్థ. శ్రియన్ భండారి, రమేష్ ధామి అథ్లెటిక్స్‌లో ఆరితేరిన క్రీడాకారులు. ప్రాక్టీస్ కోసం వారు ఉపయోగించే బూట్లు అత్యంత ఖరీదైనవి కావడంతో సంవత్సరానికి మూడు నాలుగు జతలు కొనడం వారికి భారమయ్యేది. బూట్ల అడుగు భాగం బాగున్నా లేస్‌లు తెగిపోవడం, చిన్న చిన్న డ్యామేజ్‌ల కారణంగా కొన్ని సార్లు అవి నిరుపయోగంగా మారేవి. ఖరీదైన బూట్లని అలా పడేయకుండా వాటిని తిరిగి ఉపయోగించుకునేందుకు అనువుగా మార్చాలనే ఓ ఆలోచన ఒక పెద్ద వ్యాపార సంస్థగా మారింది. మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన శ్రియన్, ఉత్తర్‌ప్రదేశ్‌లో పేరొందిన అథ్లెట్ రమేష్ దామితో కలిసి డిసెంబర్ 2013లో జోళ్లని పునరుద్ధరించే పనిని ప్రారంభించాడు. గ్రీన్‌సోల్ సంస్థగా రూపుదిద్దుకున్న ఈ సంస్థకు ప్రస్తుతం 17 కార్పోరేట్ సంస్థలతోపాటు కోర్‌టీమ్ సభ్యులు, టెంపరరీ వర్కర్లుగా వందలాది మంది పనిచేస్తున్నారు. వీరంతా వివిధ ప్రాంతాల్లోని స్కూళ్లు, కాలేజీలతో పాటు సానిక కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలో ఏర్పరిచిన డ్రాప్ బాక్సుల నుండి పాత చెప్పులని సేకరిస్తారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఎఐ) క్రీడాకారుల వద్ద నుండి సేకరించిన పాత బూట్లని కూడా గ్రీన్ సోల్ సంస్థకి అందిస్తోంది. ఇలా సేకరించిన పాత జోళ్లని ముంబయ్ నవి ప్రాంతంలో ఉన్న తయారీ యూనిట్‌కి చేర్చుతారు. బూట్ల సేకరణ కోసం కొందరు సభ్యులు పనిచేస్తే వివిధ ప్రాంతాల్లో చెప్పులు బడిపిల్లల కాలి నమూనాలని తీసుకొచ్చే పనిని మరికొందరు చేస్తారు. అందుకు గ్రీన్‌సోల్ సంస్థ ముందుగా కొన్ని గ్రామాలను ఎంచుకుని ఒక సర్వేని నిర్వహిస్తుంది. ఆ సర్వే ప్రకారం పిల్లల కాలికి న సేకరించిన బూట్లని శుభ్రపరిచి వాటి అడుగు భాగం(సోల్)ని వేరుచేయడం దగ్గర నుండి తయారీ యూనిట్ వద్ద అసలు పని మొదలవుతుంది. చిన్నారుల కాళ్లకు అనువైన పరిణామంలో కట్‌చేసిన సోల్స్‌ని చెప్పుల అడుగు భాగంగా ఉపయోగిస్తారు. బూట్ల పైభాగం చెప్పుల పట్టీలుగా లేస్‌లని ప్యాకింగ్ కోసం వినియోగిస్తారు. సాధారణంగా అన్ని చెప్పుల తయారీ యూనిట్లలో పాత చెప్పులని కరిగించి కొత్తవాటిని తయారు చేస్తుంటాయి. వీటి ద్వారా పెద్దఎత్తున వెలువడే కార్బన ఉద్గారాల వల్ల పర్యావరణాని హానికలిగే ప్రమాదం ఉండడంతో పాత జోళ్లను కరిగించకుండా వాటిని పునరుద్ధరించే పద్ధతిని ఎంచుకున్నాడు శ్రియన్. వీటిని ఉచితంగా అందించడంతోపాటు కొన్ని స్టాల్స్‌ని ఏర్పాటు చేసి ప్రదర్శనకు ఉంచుతారు. ప్రతి వస్తువును పూర్తి స్థాయిలో ఉపయోగించి తయారుచేసే కొత్త జోళ్లు ఇప్పటివరకు పది వేలకుపైగా చిన్నారుల పాదాలకి రక్షణనిస్తున్నాయి. ఫండ్ రైజింగ్ కోసం తక్కువ ఖర్చుతో పునరిద్ధరింపబడిన జోళ్ల కొనుగోలు చేసేందుకు వీలుగా గ్రీన్‌సోల్ సంస్థ రిటైల్‌గానూ వీటిని అందుబాటులోకి తెచ్చింది. పిల్లల బూట్లు, హీల్స్ తప్ప అన్ని రకాల బూట్లు, చెప్పులను స్వీకరిస్తుందీసంస్థ. కొరియర్ ద్వారా ఈ సంస్థకి తమ పాత బూట్లను పంపవచ్చు. వేలాది మంది చిన్నారుల పాదాలకి రక్షణనిస్తున్న శ్రియన్, రమేష్ సృజనాత్మక డిజైన్లు, ఆలోచనలకు రెండు పారిశ్రామిక పేటెంట్స్ ఉన్నాయి. మారుమూల గ్రామాల్లో ఉచితంగా పాదరక్షలను అందిస్తూ వారికి రక్షణ కల్పించడంతోపాటు అవగాహనా సదస్సులని నిర్వహించి ప్రజల జీవన విధానంలో మార్పు తెచ్చేందుకు కృషిచేస్తోంది గ్రీన్‌సోల్ సంస్థ.



– శారద



కనని హత్యలు

ఆ ఇంట్లో ఆస్తి పంపకాల లెక్కలు, చర్చలు సాగుతున్నాయి. ఇంకా ఇంటి పెద్దాయన చనిపోలేదు. కానీ వయసుడిగి పోయిన్నాడు. అంతమంది సొంతోళ్ల మధ్య ఒంటరిగానైనా బతికే ఉన్నాడు. బిడ్డల మాటలు చెవికి సోకగానే వెన్ను వణికింది ముసలాయనకు. ఎందుకంటే ఆ చర్చల తర్వాత వెంటనే ఓ కార్యక్రమానికి ముహూర్తం ఖరారవుతుంది. అదే తలైకూతల్. 'ప్రేమ'గా ఒళ్లంతా నూనె పట్టించి... 'సుకుమారం'గా తలార స్నానం పోయించి... అనురాగంతో తీపి పానకాన్ని తాగించే ఈ తంతులో ప్రేమ, అనురాగమంతా బూటకమే. ఇదంతా ఓ హత్యకు పథకం, కార్యక్రమం. ఈ తంతు వల్ల శరీర ఉష్ణోగ్రత 92-94 డిగ్రీ ఫారెన్‌హీట్‌కు పడిపోతుంది. అంటే జీవక్రియలు మందగిస్తాయి, శీతవాతానికి గురి అవుతారు. కొన్ని ఘడియల్లోనో, కొన్ని రోజుల్లోనో చనిపోతారు. అవసాన దశలో ఉన్న వారిని ఇలా బలవంతంగా చంపేయడం ఎప్పటి నుంచో ఉంది. ఒకప్పుడు బాహాటంగా జరిగిన ఈ తంతు చట్టం, కేసులు, శిక్షల భయంతో నాలుగు గోడల మధ్యే గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోతోంది. పల్లెల్లో ఇవి ఎక్కువగా జరుగుతున్నట్టు పలు పత్రికల స్టింగ్ ఆపరేషన్లలో వెలుగుచూసింది. ఆ మధ్య తలైకూతల్ మాట వినబడలేదు. 2010 తర్వాత దీని ఉనికి అధికమైంది. ఇది మళ్లీ ఎక్కువగా ప్రచారంలోకి రావడానికి కారణం ఆధునిక జీవితాలు, కుటుంబాల్లో పెరిగిపోతున్న అగాథాలు. ఎంత దారుణం అంటే కొన్ని చోట్ల ఇలాంటి కార్యక్రమాలు చేసేవారు వేరే సేవల పేర్లతో, వివరాలతో ప్రచారం పెంచుకుంటున్నారని కొందరి వాదన.

బంధం,
మానవత్వం అనే మాటలు
చచ్చిపోతాయి తలైకూతల్ మాటెత్తితే.
ప్రాణం పోసి, జీవితాన్నిచ్చిన కన్నవారిని హత్య చేస్తున్న దుష్ట సంప్రదాయమిది. తమిళనాడులో కనిపించే ఈ ఆచారం బోర్డర్ దాటి దక్షిణాదికి పాకిపోయింది. చట్టాల కళ్లు గప్పి సాగుతోన్న ఈ వ్యవహారం ఈ మధ్య మరింత ఎక్కువయ్యింది. పెన్షనర్ల సంఘాలు, వృద్ధుల హక్కుల పోరాట వేదికలు విని ఉంటారు. తలైకూతల్ పేరిట జరిపే బలవంతపు హత్యల నిరోధక సంఘాల్ని దురదృష్టం కొద్దీ వృద్ధులే ఏర్పాటు చేసుకున్న సమాజం తయారైంది. ఆ వివరం మీకోసం...

చూడ్డానికి సాధారణ చావులా కనిపించే ఈ హత్యలు తమిళనాడులోని విరుదునగర్ జిల్లా దాని పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నట్టు వార్తలు వచ్చాయి. కొందరు వృద్ధులు ఈ తంతు నుంచి తప్పించుకుని మీడియాను, పోలీసులను ఆశ్రయించడంతో దీని మీద పరిశోధన ప్రారంభమైంది. విరుదునగర్ జిల్లాలోని వృద్ధులు ఓ సంఘంగా ఏర్పడి వీటిని అడ్డుకునే వరకు విషయం వెళ్లిందంటే తలైకూతల్ తంతు ఎంత తీవ్రస్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇదే కాదు కెవోర్కియన్ శైలి ఇంజెక్షన్లు ఇస్తోన్న సందర్భాలు, వీటి కోసమే ప్రత్యేకంగా కొందరు వ్యక్తులు పనిచేయడం వెలుగుచూసింది. వీళ్లు మెడికల్ ప్రొఫెషనల్స్‌లా ప్రచారమవుతుంటారు. వీరి బారిన పడలేక ఇంట్లో వారిపై ఆధారపడకూడదని కొంతమంది వృద్ధులు ఇళ్లలోంచి తప్పించుకొచ్చి బిచ్చగాళ్లుగా మారడం, ఆత్మహత్యలు చేసుకోవడం వంటివి కూడా జరిగాయి. వెన్ను అంతా ఒంగిపోయినా బాణాసంచా చుట్టలు చుడుతూ, కాయో పండో అమ్ముకుంటూ తిప్పలు పడుతున్న వారిది మరీ వ్యథ. చుట్టుపక్కల ఇళ్లలో తలైకూతల్ తంతులు చూసి క్షణంక్షణం బిక్కుబిక్కుమంటూ సొంతవారి మధ్యే అభద్రతతో బతకడానికి మించిన కన్నీటి కథ ఇంకేముంటుంది. మీడియాలో వచ్చిన వరుస కథనాలతో మరో కేసు వెలుగులోకి రాకున్నా రహస్యంగా ఈ హత్యలు జరిగిపోతున్నాయని అనేవాళ్లున్నారు. కారుణ్య మరణాల పేరిటా కూడా మంచంపట్టిన వృద్ధుల విషయంలో తీవ్ర నేరం చేస్తున్నారని అంటారు. ఈ సామాజిక రుగ్మత నుంచి బయటపడేయడానికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నా కూడా ఏటా చావులు ఆగడంలేదని, అవి పదులు, వందల్లో ఉన్నా ఆశ్చర్యం లేదనేది సామాజిక కార్యకర్తల మాట. పేద కుటుంబాల్లో ఒకప్పుడు ఎక్కువగా ఉండేది. కానీ ఆస్తుల మీద వ్యామోహం ఇతర లాభాపేక్షలతో ధనిక కుటుంబాల్లోను ఈ సమస్య ముదురుతోంది. ఒంటరి వృద్ధుల మీద ప్రభావం మరీ ఎక్కువగా ఉంటోంది. అంతర్జాతీయంగాను తలైకూతల్ హత్యలు సంచలనమయ్యాయి. అయినా ఇప్పటికీ చడీచప్పుడు కాకుండా బలవన్మరణాలు సాగిపోతున్నాయి.

- జేఎస్పీ



కాలీఫ్లవర్ పకోడి

కావాల్సిన పదార్థాలు

కాలీఫ్లవర్ - 1
శనగపిండి - 1 కప్పు
బియ్యపు పిండి 3/4 కప్పు
మొక్కజొన్న పిండి - 3/4 కప్పు
ఉప్పు - తగినంత
కారం - 2 టీ స్పూనులు
జీలకర్ర పొడి- 1 టీ స్పూను
పసుపు - పావు టీ స్పూను
ఇంగువ పొడి - పావు టీ స్పూను
నూనె - తగినంత

తయారు చేసే విధానం:

కాలీఫ్లవర్‌ను శుభ్రంగా కడిగి ముక్కలుగా విడగొట్టుకోవాలి. తర్వాత స్టౌపై బాణలి పెట్టి అందులో ఉప్పు కలిపిన నీరు పోసి కాలీఫ్లవర్ ముక్కలను ఉడకబెట్టాలి. ఉప్పు కలిపిన నీరు వల్ల ఫ్లవర్‌లో పురుగులుంటే బయటకు వస్తాయి. తర్వాత బాణలిలో నీరు ఇంకేంత వరకు స్టౌపై ఉంచాలి. తర్వాత కాలీఫ్లవర్ ముక్కలను శనగపిండి, బియ్యపుపిండి, మొక్కజొన్న పిండిలో కలపాలి. తర్వాత కారం, పసుపు, ఇంగువ పొడి, జీలకర్ర పొడిని దాని మీద చల్లాలి. ఇవి కలిపినందున మంచి రుచితో బాటు వాసన కూడా ఘుమాయిస్తుంది. అంతేగాక ఇవి బాణలిలోని కాలీఫ్లవర్‌లో ఉన్న తేమను సరిచేస్తుంది. అవసరమైతే కొద్దిగా నీరు చల్లుకోవచ్చు. తర్వాత బాణలిలో ఉడికిన ఫ్లవర్‌ను వేరే పాత్రలోకి తీసుకోవాలి. వేరే బాణలిలో నూనె పోసి వేడి చేయాలి. నూనె బాగా వేడెక్కిన తర్వాత సిద్ధం చేసుకున్న కాలీఫ్లవర్ ముక్కలను అందులో వేయాలి. బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. వేగిన ముక్కలను టిష్యు పేపర్‌లోకి తీసుకోవాలి. అప్పుడు అదనంగా ఉన్న నూనెను పేపరు లాగేస్తుంది. అంతే ఘుమఘుమలాడే గోబీ పకోడీ రెడీ.

గోబీ 65

కావాల్సిన పదార్థాలు

కాలీఫ్లవర్ - చిన్నది
తరిగిన కరివేపాకు - 2 రెబ్బలు
కొత్తిమీర తరుగు - 1 కప్పు
ఉప్పు - తగినంత
కారం - 1 టీ స్పూన్
వెల్లుల్లి పేస్ట్ - టీ స్పూన్
మిరియాల పొడి - అర టీస్పూన్
గరం మసాలా - అర టీ స్పూన్
నూనె - తగినంత
బియ్యం, శెనగ పిండి - 3 టీ స్పూన్‌లు
మొక్కజొన్న పిండి - 4 టీ స్పూన్‌లు



తయారు చేయు విధానం

కాలీఫ్లవర్‌ను శుభ్రం చేసుకుని వేడి నీటిలో ఒక నిమిషం మగ్గనివ్వాలి. తర్వాత వాటిని ఒక గిన్నెలోకి తీసుకొని ఉప్పు, వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, తరిగిన కరివేపాకు, కొత్తిమీర తరుగు, కారం, మిరియాల పొడి కలపాలి. తర్వాత అన్ని రకాల పిండిని కలిపి కాలీఫ్లవర్‌లో పోయాలి. ఆ మిశ్రమానికి కొద్దిగా నీరు చేర్చి స్టౌ మీద మగ్గనివ్వాలి. ఇందులోనే పచ్చిమిర్చి, కరివేపాకు వేసి మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసుకొని కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేసి వేడి వేడిగా గోబీ 65 రుచి చూడండి.

కాలీఫ్లవర్ మంచూరియా

కావాల్సిన పదార్థాలు

కాలీఫ్లవర్ - 1(చిన్నది)
మైదా - నాలుగు చెంచాలు
మొక్కజొన్న పిండి - ఎనిమిది చెంచాలు
కొత్తిమీర - ఒక కట్ట
నూనె - సరిపడినంత
అజీనీమోటో - తగినంత
అల్లం, వెల్లుల్లి పేస్ట్ - స్పూన్
ఉప్పు - తగినంత
కారం - తగినంత
టమోటా సాస్, సోయా సాస్, చిల్లీ సాస్ - తగినంత

తయారు చేసే విధానం:

మొదటగా కాలీఫ్లవర్‌ను శుభ్రంగా కడగాలి. తర్వాత దానిని ముక్కలుగా విడగొట్టాలి. వాటిని మైదా, మొక్కజొన్న పిండి, అల్లం, వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, కారం వేసి కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. తర్వాత స్టౌ మీద బాణలి పెట్టి అందులో నూనె పోసి బాగా వేడి చేయాలి. వేడి చేసిన నూనెలో సిద్ధం చేసిన కాలీఫ్లవర్ ముక్కలను వేయాలి. బంగారు రంగు వచ్చే వరకు ఉంచి సోయా సాస్, టమోటా సాస్, చిల్లీ సాస్, అజీనీమోటో వేసి బాగా కలిపి కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.

రంగులు అద్దండి



కనిపెట్టండి

బన్నీ వాళ్ల డైనింగ్ హాల్లో వాళ్ల అమ్మకి కనిపించకుండా కొన్ని చెంచాల్ని(స్పూన్స్) దాచిపెట్టాడు. అవెక్కడున్నాయో కనిపెట్టండి.

అతికిద్దాం

చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. అమ్మాయి బొమ్మను కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. ఇక్కడిచ్చిన బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.



బొమ్మను పూరించండి

పిల్లలూ! మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదూ! మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ఉడుత బొమ్మని ఎలా గీయోచ్చో ముందుగా ఇక్కడ గీసి ఉంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండే!

భిన్నమైనదేది

ఇక్కడ మొత్తం ఏడు వరుసల్లో కింది బొమ్మలనుంచాం. వాటిలో ఒక భిన్నమైన బొమ్మ ఉంది. అదెక్కడుందో కనిపెట్టి సున్నా చుట్టేయండి.



తేడాలు గుర్తించండి

ఈ రెండు బొమ్మల్లో కొన్ని తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సున్నాచుట్టేయండి.



పదాలు గుర్తించండి

పిల్లలూ! మీరు లైబ్రరీకి వెళ్తుంటారు కదా. మీ కోసం లైబ్రరీకి సంబంధించిన కొన్ని పదాల పేర్లను ఇక్కడుంచాం! పైనున్న అక్షరాల పట్టికలో అవెక్కడున్నాయో గుర్తించి పెన్నుతో మార్క్ చేయండి.

AUTHOR
BIOGRAPHY
BOOKS
CARD
COMPUTER
DESK
FICTION
LIBRARIAN
NOVEL
READ

F	E	R	B	M	D	F	E	R	E	A	D	F	L	L
R	B	N	O	I	T	C	I	F	L	G	E	R	S	I
V	M	S	F	O	O	M	N	E	Y	P	S	R	K	B
C	R	S	P	R	G	G	V	K	Q	O	K	X	O	R
Q	R	P	M	X	X	O	R	C	W	P	S	U	O	A
R	M	U	A	I	N	B	O	A	U	Z	O	Z	B	R
J	O	J	J	E	D	M	E	M	P	A	D	W	T	I
P	O	H	M	Q	P	C	A	H	X	H	P	T	T	A
W	X	N	T	U	N	K	W	F	C	F	Y	Q	T	N
G	J	O	T	U	Y	S	X	G	A	A	I	T	X	U
Y	L	E	O	W	A	B	N	R	G	V	R	K	H	L
F	R	O	G	O	F	V	S	S	S	T	U	D	Y	F
W	X	P	B	E	Q	P	U	D	N	T	U	Q	T	F
F	H	E	A	C	F	L	N	Q	N	V	U	C	S	Q
F	L	X	M	Q	Q	I	L	J	Y	G	O	T	P	Y



12 ఏళ్ల కంపోజర్



పిల్లలూ మీరు ఏదైనా కొత్త పదం, పాటగానీ విన్నప్పుడు వాటిని ఎంతసేపు గుర్తుంచుకోగలుగుతారు. రెండు మూడు సార్లయినా వినకుండా వాటిని పలికేయడం చాలా కష్టం కదా. కానీ భారత సంతతికి చెందిన 12 ఏళ్ల స్పర్శ్ విన్న ప్రతి విషయాన్నీ టకీ మని పలికేస్తుంటాడు. 14 ఏళ్ల క్రితం అమెరికాలో స్థిరపడిన హైరెన్ జిగిషా షాల కొడుకు స్పర్శ్. అమ్మ కడుపులో ఉన్నప్పుడే ఆస్టియోజెనెసిస్ ఇమ్‌పర్ఫెక్టా అనే వ్యాధి సోకడతో 35-40 విరిగిన కండరాలతోనే పుట్టాడు స్పర్శ్. ఎప్పటికీ నయంకాని వ్యాధి కారణంగా ఇప్పటికే స్పర్శ్ శరీరంలో 125 ఎముకలు గాయపడడంతో వీల్ ఛైర్‌లోనే తన పనులన్నీ చేసేస్తుంటాడు. ఇప్పటికే ఇంగ్లీష్‌లో దాదాపు 10 పాటల్ని కంపోజ్ చేసి, కంపోజర్‌గా, గాయకుడిగా రాణిస్తున్నాడు స్పర్శ్. 250 డిజిట్ల పై విలువని గుక్కతిప్పుకోకుండా చెప్పేయగలడు. ఇంగ్లీష్ భాషలో నాలుగు యాసల్లో మాట్లాడటంతోపాటు డిక్షనరీలో అతి పెద్ద 12 పదాల్ని కేవలం 18 సెకండ్లలో పలికేయగలడు. వాట్ ఎన్ఎక్స్‌టి రోబోటిక్స్ జట్టు సభ్యుడిగా ఎంపికైన స్పర్శ్ 2012లో అమెరికాలో నిర్వహించిన ప్రాంతీయ, రాష్ట్రస్థాయి రోబోటిక్స్ పోటీల్లో ప్రథమ ప్రపంచ రోబోటిక్స్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ని సొంతం చేసుకున్నాడు. 2015లో న్యూయార్క్ సిటీలోని భారతీయ కాన్సులేట్‌లో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో అంబేద్కర్‌పై ప్రసంగం చేసి ఫస్ట్‌ప్రైజ్‌ని గెలుచుకున్నాడు. మూడేళ్ల వయసులో కీబోర్డ్ సాధన ప్రారంభించిన స్పర్శ్ ఆరేళ్ల వయసులో భారత్‌కి చెందిన పండిట్ జస్‌రాజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్‌లో ప్రవేశాన్ని పొందాడు. ఫిబ్రవరి 2016లో పిజెఐఎమ్ సంస్థ నిర్వహించిన ప్రతిష్టాత్మక గాననిపుణ్ శ్రద్ధ పాటల పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతిని గెలుచుకున్నాడు. తన ఐదేళ్ల తమ్ముడు అనుజ్‌తో కలిసి వీడియోగేమ్స్ ఆడడంతో పాటు చదువులోనూ ప్రతిభ కనబరుస్తున్నాడు స్పర్శ్. అమెరికన్ వోకల్ మ్యూజిక్‌లోనూ ఆరితేరిన స్పర్శ్ సొంత కంపోజిషన్‌లో పాటలు రాసి దాని ద్వారా వచ్చే డబ్బుని క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఖర్చు చేస్తున్నాడు.

పదవికాసం - 39

కూర్పు: రావెళ్ల

ఆధారాలు

అడ్డం

1. పట్టుతోపాటుగా ఉండవలసింది (3)
3. తమిళనాడు ముఖ్యమంత్రి (5)
6. గీరదం(2)
7. నీరు, బెల్లం, మిరియాలను కలపండి (3)
9. నెమలి పింఛం (2)
10. జాతర (2)
11. శవాన్ని కాల్చేందుకు పేర్చే కట్టెలు (2)
13. ఎండమావి (3)
14. పొమ్మనండి (1)
15. ఒక పురుగు (3)
17. సుకృతంలో 3, 1 అక్షరాలు (2)
19. బాణం (2)
20. కష్టజీవికి రెండు వైపులా ఉండేవాడు(2)
21. కాన్పు (3)
23. ధూమము (2
26. మేఘావృతమవు (5)
27. తుదిలేనిగరుత్మంతుడు (3)

1		2	✿	3		4		5
	✿		✿		✿		✿	
6		✿	7		8	✿	9	
	✿	10		✿	11	12	✿	✿
13			✿	14	✿	15		16
✿	✿	17	18	✿	19		✿	
20		✿	21	22		✿	23	
	✿	24	✿		✿	25	✿	
26					✿	27		

నిలువు

1.వేమన పద్యంలోని చివరి ఐదు అక్షరాలు (5)
2. ఒక నక్షత్రం (2)
3.పాతకాలపు సినీ నటి (3)
4.లక్ష్మి (2)
5.దండనాధికారి ఉరితీసేవాడు (3)
7.గిన్నె (2)
8. ఒక పుణ్యక్షేత్రం (2)
10. బిచ్చమెత్తడం (3)
12. చీకటి (3)
16. బుద్ధుడు (5)
18. తుదిలేని సుప్రభాతం (2)
19. పీనుగు (2)
20. కలకలములో రాసేది (3)
22. మొదలులేని ఒక రకం అట్టు (3)
24. ఈ పురుగు వృక్షాన్ని చెరుస్తుంది (2)
25. కక్ష వంటిదే (2)

సుడోకు

7	3		2	9	4		6	
		1			6			
4	5			8				
			3				8	6
2	8	3			7	4		
	6						1	
	7			2	5			
8				7				
		5	4			7	9	

గతవారం జవాబులు

9	1	6	2	4	7	3	5	8
2	3	8	9	5	6	1	7	4
4	5	7	1	3	8	9	6	2
5	2	1	8	6	3	4	9	7
3	8	9	4	7	2	5	1	6
7	6	4	5	9	1	2	8	3
6	4	5	3	8	9	7	2	1
8	9	2	7	1	4	6	3	5
1	7	3	6	2	5	8	4	9

1 దీ	పా	2 వ	ళి	✿	3 వ	4 క్కా	ణం	5 చ
వె	✿	త్ర	✿	6 జై	✿	హం	✿	ల
7 న	ల	✿	8 కో	ర	9 క	✿	10	క
లు	✿	11 గా	మా	✿	12 వృ	13 అ	✿	న
✿	14 సా	ర	✿	✿	✿	15 ర	త్ర	✿
16 చూ	✿	17 లు	18 వా	✿	19 మే	సె	✿	20 మ
21 ర	శ్మి	✿	22 పా	23 తా	ళం	✿	24 దా	పి
గా	✿	25 బా	✿	చ	✿	26 బా	✿	బా
27 ను	ఒ	కా	రం	✿	28 దే	వ	దా	రు

నీటి రంగుల నగరాలు

ప్యారిస్, ఫ్రాన్స్

యాంగాన్,మయన్మార్



వర్షంలో తడిసిముద్దయిన నగరం ఎలా కనిపిస్తుందో సుంగా పార్క్ వర్ణ చిత్రాల్లో వాటి ల్యాండ్ మార్క్‌లు చిలకరిస్తాయి. నీటి రంగుల్లో పులకరిస్తాయి. బ్యాంకాక్‌లో నివసిస్తున్న కొరియా చిత్రకారిణి సుంగా పార్క్ ప్రపంచ యాత్రల్లో పడిపోతుంటుంది. ఆ యాత్రల్లో చారిత్రక సౌధాల కళా సౌందర్యంలో ఆమె మనసు కొట్టుకుపోతుంది. అందుకే సందర్శించిన ప్రతి కట్టడాన్ని తన రంగుల చిత్రాల్లోకి తర్జుమా చేయడంలో మునిగిపోతుంది. డిజైనర్, ఇల్లస్ట్రేటర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న సుంగా ఆర్కిటెక్చర్ శైలుల్ని అధ్యయనం చేసోంది. మొత్తం కట్టడంలోని ఓ డిటైల్ ఆమెను కట్టిపడేస్తుంది. దాన్నే తన స్కెచ్‌ల్లో హైలెట్ చేస్తూ 'అన్ ఫినిషిడ్' శైలిలో వాటర్ కలర్స్‌తో చిత్రిస్తుంది. ఈ అసంపూర్ణతనే అద్భుతంగా మలుస్తుంది. అదో కొత్త ఎఫెక్ట్‌లా ఇవి విలక్షణంగా కనిపిస్తాయి. ఫేడ్ అవుట్ అయిన రంగులతో ఈ ఎఫెక్ట్ పర్‌ఫెక్ట్‌గా తూగి మనల్ని.. ఒకేసారి కాలం వెనక్కు లాక్కెకుతూ, ఆ కట్టడాల ముందుకు తోసుకెళుతూ నీటి రంగుల మహా నగరాల్ని ఓ కొత్త కోణంలో చూపెడుతోంది.



బెర్లిన్, జర్మనీ

స్ట్రాస్‌బర్గ్, ఫ్రాన్స్



స్టాక్‌హోమ్, స్వీడన్

ఓ ఒయాసిస్ ఊరు...



ఎడారుల్లో ఎండమావులు... వాటిల్లో అందమైన ఊహలు... వాటిల్లో అద్భుతమైన ఊళ్లు, సెలయేళ్లు ఒట్టి భ్రమలేనా. అవన్నీ ఏమో గానీ ఈ ఒయాసిస్ ఊరు మాత్రం కాదు. హువాకచినా దీని పేరు. 'ఒయాసిస్ ఆఫ్ అమెరికాస్'గాను పిలుస్తారు. ఇదే రెండు అమెరికా ఖండాల్లోను చివరి ఒయాసిస్ ఊరుగాను పేరొందింది కూడా. పెరూలోని ఇకా ప్రావిన్స్‌లోని ఎడారిలో ఉందీ ప్రాంతం. స్థానికులు వంద మందే కానీ పర్యాటకులతో నిండిపోతుంది. ఈ ఊరికి... ఓ వేటగాడు రాకుమారిని ఎత్తుకెళ్లడం, ఎడారిలో దారి తప్పడం, చూపుడు అద్దం పగిలి సరస్సు అవడం, అందమైన రాకుమారి జలకన్యలా మారిపోవడం అనే ఇతివృత్తంతో ఓ జానపద కథ కూడా ఉంది. రెండు ఇసుక తిన్నెల మధ్య ఓ సరస్సు, దాని చుట్టూ ఓ ఊరు అంతా కల్పనలా... సుదూరం నుంచి చూస్తుంటే ఎండమావి భ్రమలా అనిపించే హువాకచినాలో పచ్చదనం ఒకింత ఎక్కువే. దీన్నో మేజికల్ టౌన్‌గా వర్ణిస్తారు. పర్యాటక నగరం లిమాకు 300 కి.మీ.దూరంలో ఉండే ఈ ప్రాంతం శ్యాండ్‌బోర్డింగ్‌కు, సాహస బగ్గీ రేసులకు కేంద్రం. మంచు మీద బోర్డింగ్‌లా ఇక్కడ మెత్తటి, సన్నని ఇసుకపై తిన్నెల పైనుంచి వాలుగా బోర్డింగ్ చేస్తూ థ్రిల్ పొందుతారు పర్యాటకులు. ఈ ఊరి చిత్రాన్ని పెరూ కరెన్సీ నోటు 50 న్యూవో సోల్ మీద కూడా ముద్రించారు. వారి వారసత్వ సంపదగా కూడా గుర్తించారు. ఈ సరస్సు నీటికి, బురదకు కొన్ని రోగాల్ని నయం చేసే లక్షణాలున్నాయని భావిస్తారు. అంటే వింతగా, విచిత్రంగా తోచే ప్రతిదానికి మహిమను ఆపాదించేయడం అన్ని చోట్లా ఉందన్నమాట.



Check List

Book Number	KNSR02B/45	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	No		
Missing Pages	No		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameena	Pages	29